## నేటి కందం- నేటికి అందం

మందికి నుపయోగ పడుచు
సుందరమగు వెలుగు లీను శోభాకృతియౌ
వందే భారత్ స్లీపరు
నందించిన మోడి కిడెద నభివాదములన్ !!

(ఎంతో మందికి ఉపయోగపడే వందే భారత్ స్లీపర్ ను ప్రధాని నరేంద్ర మోడీ మాల్దా లో పచ్చజెండా ఊపి ప్రారంభించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

## చురక

అరుణ పతాకానికి
అజరామర వందేళ్లు
నది చీలిన పాయలుగా
నేడు ఉనికి సవాళ్లు.
ఐక్యతింకా నినాదాల
ఆభరణం ఎన్నాళ్లు
విలీనం జరుగుతేనే
విస్తృతికిక పరవళ్లు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 20-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:134 పేజీలు:6 వెల: రూ.1/-


# భారత్ చేరుకున్న యూఏఈ అధ్యక్షుడు.. స్వయంగా స్వాగతం పలికిన మోదీ





న్యూఢిల్లీ, జనవరి 19:యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్ చేరుకున్నారు. ప్రధాని మోదీ స్వయంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. యూఏఈ అధ్యక్షుడ్ని ఆలింగనం చేసుకోవడంతో పాటు ఎయిర్‌పోర్ట్ నుంచి వారిద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. ఆ తర్వాత మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఆయన కుటుంబ సభ్యులను కొత్త అధికార నివాసానికి మోదీ తీసుకెళ్లారు. భారత సంప్రదాయ బహుమతులను వారికి అందజేశారు. సుమారు రెండు గంటల అధికార పర్యటనకు వచ్చిన యూఏఈ అధ్యక్షుడితో పలు అంశాలపై ప్రధాని మోదీ చర్చించారు. ఆయనను ఆత్మీయ మిత్రుడిగా ఎక్స్ పోస్ట్‌లో మోదీ అభివర్ణించారు.కాగా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త తలు నెలకొన్న తరుణంలో యూ ఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్ భా రత్ పర్యటన ప్రాధాన్యత సంత రించుకున్నది. ప్రధాని మోదీ ప్రత్యేక ఆహ్వానం మేరకు రెండు గంటల పర్యటన కు ఆయన విచ్చేశారు. యూఏ ఈ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీక రించిన తర్వాత భారత్‌లో పర్యటి ంచడం ఇది మూడోసారి. గత పదేళ్లలో ఐదో పర్యటన కావడం విశేషం.

# హైదరాబాద్‌లో భారీగా పోలీసుల బదిలీలు

హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్‌లో భారీగా పోలీసుల బదిలీలు చేపట్టారు. 54 మంది సీఐలను బదిలీ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సిటీ కమిషనర్ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ నుంచి భారీగా బదిలీలు చేపట్టగా.. మరో 26 మంది సీఐల బదిలీలను పెండింగ్‌లో పెట్టారు. వారిని సీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయమని ఆదేశాలు జారీ చేశారు.

# మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌ల నియామకం

## మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌లు.. భువనగిరికి సీతక్క.. ఖమ్మంకు సురేఖ



హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మున్సిపల్ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారు. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. 1. ఆదిలాబాద్ - సుదర్శన్ రెడ్డి 2. నిజామాబాద్ - ఉత్తమ్‌కుమార్ రెడ్డి 3. మల్కాజ్‌గిరి - కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 4. చేవెళ్ల - శ్రీధర్‌బాబు 5. మెదక్ - వివేక్ 6. కరీంనగర్ - తుమ్మల నాగేశ్వరరావు 7. పెద్దపల్లి - జూపల్లి కృష్ణారావు 8. నల్గొండ - అడ్లూరి లక్ష్మణ్ 9. భువనగిరి - సీతక్క 10. వరంగల్ - పొంగులేటి 11. మహబూబ్‌నగర్ - పొన్నం ప్రభాకర్ 12. మహబూబ్‌నగర్ - దామోదర రాజనర్సింహ 13. జహీరాబాద్ - అజహరుద్దీన్ 14. నాగర్‌కర్నూల్ - వాకిటి శ్రీహరి 15. ఖమ్మం - కొండా సురేఖ

# సత్యం కంప్యూటర్ స్కామ్‌లో జన్వాడ భూములపై నాంపల్లి ప్రత్యేక కోర్టు సోమవారం విచారణ





హైదరాబాద్, జనవరి 19:సత్యం కంప్యూటర్ స్కామ్‌లో జన్వాడ భూములపై నాంపల్లి ప్రత్యేక కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. జన్వాడ ల్యాండ్ కేసులో సత్యం రాజు, నందిని రాజు, తేజ రాజులతో పాటు 213 మందికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని నాంపల్లి ప్రత్యేక కోర్టు ఆదేశించింది.

భారతదేశ ఆర్థిక చరిత్రలోనే అతిపెద్ద కార్పొరేట్ మోసాల్లో ఒకటిగా పేరుగాంచిన సత్యం కంప్యూటర్స్ స్కామ్ మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ స్కామ్‌కు సంబంధించిన జన్వాడ భూముల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములు, ముఖ్యంగా జన్వాడ ప్రాంతంలోని ల్యాండ్స్, సత్యం స్కామ్‌లో భాగంగా అక్రమంగా కొనుగోలు చేశారనే ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి.

**నిధుల మళ్లింపు..**

సత్యం కంప్యూటర్స్ ద్వారా దారి మళ్లించిన నిధులను వినియోగించి ఈ భూములు కొనుగోలు చేశారని ఈడీ దర్యాప్తులో తేలింది. సీబీఐ గతంలో చేసిన విచారణలో కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, హైదరాబాద్ చుట్టుపక్కల వందల ఎకరాల భూముల వివరాలు పూర్తిగా బయటపడలేదని ఈడీ అధికారులు తెలిపారు. జన్వాడ ల్యాండ్స్ వ్యవహారం రాజకీయ, వ్యాపార వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఈ భూముల కొనుగోలు పెద్ద సంచలనం సృష్టించింది.

ఈ కేసులో తాజాగా.. అభినవ్ అనే వ్యక్తి కీలకంగా మారాడు. జన్వాడ భూముల వ్యవహారంపై తనకు తెలిసిన విషయాలను కోర్టు ముందు వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ అభినవ్ నాంపల్లి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తాను ఈ స్కామ్‌లో జరిగిన అసలు విషయాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నానని, సాక్షిగా వాంగ్మూలం ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలని కోరాడు. ఈ నేపథ్యంలో ఈ కేసును మరింత సమగ్రంగా తీసుకెళ్లే అవకాశముందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అభినవ్ వాంగ్మూలం కొత్త ఆధారాలను బయటపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు తెలియని బినామీ లావాదేవీల వివరాలు, రాజకీయ, వ్యాపార సంబంధాల వంటి కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కోర్టు ఆయనను సాక్షిగా అనుమతిస్తే, కేసు దిశ పూర్తిగా మారే అవకాశం ఉంది.

జన్వాడ భూముల కేసును ఈడీ అధికారులు సీరియస్‌గా తీసుకుని విచారణ చేస్తున్నారు. సత్యం రాజు(రామలింగ రాజు), నందిని రాజు, తేజ రాజుతో పాటు మొత్తం 213 మందికి నాంపల్లి ప్రత్యేక కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల ద్వారా అక్రమ ఆస్తుల వివరాలు, భూముల కొనుగోలు విధానం, నిధులు తదితర అంశాలపై వివరణ ఇవ్వాలని ఈడీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సత్యం కంప్యూటర్స్ స్కామ్‌పై గతంలో సీబీఐ విస్తృతంగా విచారణ చేసింది. ఆ విచారణలో నిధుల దారి మళ్లింపు, తదితర అంశాలు బయటపడ్డాయి. అయితే.. అప్పట్లో భూముల కొనుగోలు అంశం పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదని ఈడీ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో వందల ఎకరాల భూములు ఈడీ విచారణలో అత్యంత కీలకంగా మారాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ భూముల విలువ ప్రస్తుతం.. వేల కోట్ల రూపాయలకు చేరినట్లు ఈడీ అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ అంశంపై 2014లో ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. సత్యం స్కామ్ ద్వారా అక్రమంగా సంపాదించిన డబ్బు ను రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడం, బినామీ పేర్లతో భూ ములు కొనుగోలు చేయడం షెల్ కంపెనీల ద్వారా లావాదేవీలు నిర్వహించడం వంటి అంశాలపై ఈడీ కేసు నమోదు చేసింది. ఇప్పుడు అదే కేసులో భాగంగా జన్వాడ ల్యాండ్స్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.


# వర్జీనియాలో డ్రగ్స్ అమ్ముతూ, వ్యభిచార ముఠా నిర్వహిస్తున్న భారతీయ సంతతి జంట అరెస్టు

వర్జీనియా జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అమెరికాలోని నార్తర్న్ వర్జీనియాలో డ్రగ్స్ అమ్ముతూ, వ్యభిచార ముఠా నిర్వహిస్తున్న భారతీయ సంతతి జంట ను అరెస్టు చేశారు. తమ స్వంత హోటల్‌లో ఈ కార్యకలాపాలకు పాల్పడినట్లు కోర్టు డాక్యుమెంట్లలో పేర్కొన్నారు. ఈ కేసులో కోశా శర్మ, ఆమె భర్త తరుణ్ శర్మపై అభియోగాలు నమోదు చేశారు. డమ్‌ఫ్రైస్‌లోని రెడ్ కార్పెట్ ఇన్‌లో డ్రగ్స్ అమ్మినట్లు, వ్యభిచారం నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కోశా ఎల్ఎల్‌సీ ద్వారా ఆ మోటల్‌ను నిర్వహించినట్లు తెలుస్తోంది. తమ ప్రమేయంతోనే దందా నిర్వహించారని, దాని ద్వారా ఆర్థిక లాభాలు పొందారని ఆరోపణలు ఉన్నాయి. 2023 మే నుంచి రెడ్ కార్పెట్ ఇన్‌ను శర్మ దంపతులు లీజ్‌కు తీసుకుని నడిపినట్లు తెలుస్తోంది. డ్రగ్ సేల్స్, వ్యభిచార ముఠా ద్వారా వచ్చిన లాభాల్లో వాటా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం లాడ్జింగ్ సౌకర్యం మాత్రమే కల్పించే మోటల్ ద్వారా దందా సాగినట్లు తెలుస్తోంది. ఫెంటనిల్ లాంటి మాదకద్రవ్యాలు అమ్మినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎఫ్‌బీఐతో పాటు ప్రిన్స్ విలియమ్ కౌంటీ పోలీసు శాఖ, వర్జీనియా పోలీసు శాఖ ఈ కేసులో సంయుక్తంగా దర్యాప్తు చేపట్టింది.

# స్కూటీని ఢీ కొట్టిన రెడీమిక్స్ లారీ.. వ్యక్తి మృతి

హైదరాబాద్, జనవరి 19: నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్కూటీని లారీ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే..ఆరంగర్ చౌరస్తాలో ఆక్టివా స్కూటీపై వెళ్తున్న వ్యక్తి పై నుంచి రెడీమిక్స్ లారీ దూసుకెళ్లింది. దీంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా,హసంనగర్ పెట్రోల్ పంప్ సమీపంలో మృతుడు నివసించే వాడని సమాచారం. పూర్తి వివారలు తెలియాల్సి ఉంది.

# కుక్కల్ని చంపడం దారుణం: రేణూ దేశాయ్



హైదరాబాద్, జనవరి 19: వీధి కుక్కలను చంపడంపై ప్రముఖ సినీనటి రేణూదేశాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కల దాడుల పేరుతో వాటిని హతమార్చడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ భూమిపై ప్రతి జీవికీ జీవించే హక్కు ఉందని స్పష్టం చేస్తూ, కుక్కలను చంపడం దారుణమని ఆమె వ్యాఖ్యానించారు.

వీధి కుక్కలపై ద్వేషంతో మాట్లాడుతున్న కొందరిపై రేణూ దేశాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుక్కలను వ్యతిరేకిస్తున్నవారికి పిచ్చి పట్టిందంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల దాడులపై వస్తున్న విమర్శలపై ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. '100 కుక్కల్లో ఐదు కుక్కలు కరిస్తే మిగతా అన్నింటినీ చంపేయాలా..' అంటూ ప్రశ్నించారు. సమస్యకు పరిష్కారం హింస కాదని, సరైన నిర్వహణ, వ్యాక్సినేషన్ అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా రేణూ దేశాయ్ మరింత భావోద్వేగానికి లోనయ్యారు. 'కేవలం కుక్కల వల్ల మృతి చెందినవారివే ప్రాణాలా..' అంటూ ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాల్లో, దోమల వల్ల వచ్చే వ్యాధులతో చనిపోయిన వారి ప్రాణాలకు విలువ లేదా అని ప్రశ్నిస్తూ, సమస్యలను సమగ్రంగా చూడాలని సూచించారు. వీధి కుక్కల హత్యలను ఖండిస్తూ.. 'ఈ భూమిపై ప్రతి జీవికి జీవించే హక్కు ఉంది' అని స్పష్టం చేశారు. మనుషుల నిర్లక్ష్యం వల్లే చాలా సమస్యలు తలెత్తుతున్నాయని, జంతువులపై నింద వేయడం సరికాదని ఆమె పేర్కొన్నారు. కుక్కలను చంపడం దారుణమని, ఇది మానవత్వానికి మచ్చ అంటూ వ్యాఖ్యానించారు. చట్టపరంగా కూడా జంతువులను హతమార్చడం నేరమని గుర్తు చేశారు.

**మీడియా ప్రతినిధుల సంభాషణపై క్లారిటీ**

ఈ అంశంపై మాట్లాడుతున్న సమయంలో మీడియా ప్రతినిధులతో జరిగిన వాగ్వాదంపై కూడా రేణూదేశాయ్ స్పందించారు. 'ఓ వ్యక్తి నన్ను ఉద్దేశించి మాట్లాడారని.. అందుకే ఆ వ్యక్తి గురించి మాట్లాడాల్సి వచ్చింది' అని స్పష్టం చేశారు. తాను ఎవరినీ అనవసరంగా అవమానించలేదని క్లారిటీ ఇచ్చారు.

నాకు పాలిటిక్స్ ఇష్టం లేదు..

ఈ వివాదాన్ని రాజకీయ రంగుకు ముడిపెట్టడంపై రేణూదేశాయ్ అసహనం వ్యక్తం చేశారు. 'నాకు పాలిటిక్స్ ఇష్టం లేదని... నేను ఏ రాజకీయ పార్టీలోకి వెళ్లడం లేదు. నా వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడొద్దు. అలానే నా వ్యక్తిగత జీవితాన్ని ఈ అంశానికి ముడిపెట్టకండి. నా పిల్లలను ఇందులోకి లాగొద్దు' అంటూ మీడియాకు రేణూదేశాయ్ విజ్ఞప్తి చేశారు.

# రహదారి భద్రతపై వ్యాస రచన పోటీలు నిర్వహణ

## – వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం

వేములవాడ, జనవరి 19: వేములవాడ రూరల్‌మండలం నూకలమర్రి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీస్ ఆధ్వర్యంలో వ్యాస రచన, డ్రాయింగ్ పరీక్షలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేసినట్టు వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం తెలిపారు.అరీవ్ అలీవ్ అనే థీమ్‌తో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుని బాధ్యతగా తీసుకొని ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగిసి, ప్రతి వ్యక్తి క్షేమంగా ఇంటికి చేరాలనే సందేశాన్ని ఈ థీమ్ స్పష్టంగా తెలియజేస్తుందని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ లేదా సీట్‌బెల్ట్ ధరించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. వీటి నివారణకు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం అత్యవసరం అని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నూకలమర్రి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బూర సదానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది రాజశేఖర్, సతీష్ తదితరులు ఉన్నారు.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

హైదరాబాద్, జనవరి 19: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నితిన్ నబీన్‌ను ప్రతిపాదిస్తూ 37 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయనకు పోటీగా ఎలాంటి నామినేషన్లు రాకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనంగా మారింది.

ప్రస్తుతం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న నితిన్ నబీన్ రేపు ఉదయం 11 గంటలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పార్టీ ముఖ్యనేతలు హాజరుకానున్నారు. ఇవాళ ఉదయం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. నితిన్ నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, ఇతర అగ్రనేతలు హాజరయ్యారు.

# సర్పంచులు నిష్పక్షపాతంగా పని చేయాలి..

## –పల్లె పాలన పై పట్టు సాధించాలి

## -పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి శాఖ కమిషనర్ శృతి ఓజా



జనగామ, జనవరి 19: గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర కీలకమని పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి శాఖ కమిషనర్ శృతి ఓజా అన్నారు. ఈ రోజు జిల్లా కేంద్రంలోనీ ఒక ప్రైవేటు కళాశాలలో 5 రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి శాఖ కమిషనర్ శృతి ఓజా, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జడ్పీ సీఈఓ మాధురి, ఇంచార్జి డీపీవో వసంత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లకి గ్రామ పంచాయతీ పాలన, విధులు, అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాల పైన శిక్షణ ఏర్పాటు చేయగా మొదటి విడతలో భాగం గా పాలకుర్తి, దేవరొప్పుల, కొడకండ్ల మండలాలకు సంబందించిన సర్పంచ్ లు పాల్గొన్నారు. పరిచయ కార్యక్రమం అనంతరం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శృతి ఓజా మాట్లాడుతూ సర్పంచ్ లకు ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమం పల్లెల్లో సుపరిపాలనకు బాటలు వేయనుందన్నారు.

గ్రామాలలో అన్ని రకాలుగా అభివృద్ధి జరగాలి అంటే బాధ్యతాయుతంగా సర్పంచ్ లు పని చేయాలన్నారు. సర్పంచ్ లు బాగా పని చేస్తేనే రాష్ట్ర స్థాయిలో వారి గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలో సర్పంచ్ లకు పొందుపరిచిన అధికారాలు, విధులు తదితర అంశాలను శిక్షణలో భాగంగా క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడడం లాంటి ప్రధాన అంశాల్లో సర్పంచ్ లు చురుకుగా పని చేయాలిసిన అవసరం ఉంటుందన్నారు.

ప్రతీ గ్రామం శుభ్రం గా, పచ్చదనంతో ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టంలోని ప్రతీ అంశాన్ని సర్పంచ్ లు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్య, వైద్యం నిరుపేదలకు అందేలా సర్పంచ్ లు కృషి చేయాలన్నారు. మానవత్వ కోణంలో పని చేయాలనీ సూచిస్తు డిజిటల్ గవర్నెన్స్ కి దోహద పడాలన్నారు. సర్పంచ్ లకి ట్రైనింగ్ కిట్స్ ని అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

# మానవ నేస్తాలు పెంగ్విన్ పక్షులు? !

## (20 జనవరి "పెంగ్విన్ అవగాహన దినం" సందర్భంగా)

చూపులకు అందంగా, నలుపు తెలుపుల సమ్మిళిత వర్ణాలతో బొద్దుగా, ముద్దుగా కనిపించే ఎగురలేని అమాయక పెంగ్విన్ జల పక్షుల సంఖ్య రోజు రోజుకు తరుగుతూ అంతరించే అంచున ఉన్నట్లు తాజా అధ్యయనాలు వెల్లడించడం ఒక జీవవైవిధ్య విఘాత హెచ్చరికగా భావించాలి. అన్ని రకాల జీవజాతుల మనుగడతోనే మానవాళి పర్యావరణ హిత ఉజ్వల భవిత ఆధారపడి ఉందని మనకు తెలుసు. పెంగ్విన్ అనబడే నీటిలో నివసించే పక్షులు అధికంగా దక్షిణ అర్ధగోళం(సదరన్ హెమిస్పియర్)లో సహజంగా కన్పిస్తాయి. పెంగ్విన్‌లలో దాదాపు 20 రకాల జాతులు ఉన్నాయి. వీటిలో అతి పెద్ద రకాలను 'ఎంపెరర్ పెంగ్విన్'లుగా, అతి చిన్న జాతి పెంగ్విన్లు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీరప్రాంతాల్లో కనిపిస్తాయి. వీటి సహజ నలుపు తెలుపు వర్ణాలు సముద్ర జలాల్లో వీటిని వేటాడే జీవుల నుంచి కనిపించకుండా (క్యామోఫ్లాజ్) ఉండడానికి దోహదపడతాయి.

పెంగ్విన్ పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందా !

పక్షుల వర్గంలో ఉన్న పెంగ్విన్‌లు ఎగురలేనప్పటికీ అద్భుతంగా ఏకధాటిగా 60 మైళ్ల వరకు తమ రెక్కల సహాయంతో ఈదడం, 530 మీటర్ల లోతు వరకు డైవింగ్ చేయగలవు. వేగంగా ఈదగల 'జెండా పెంగ్విన్'లు గంటకు 35 కిమీ దూరం ప్రయాణం చేయగలవు. పెంగ్విన్ పక్షి జాతులను కాపాడుకోవడానికి సామాన్య జనాల్లో అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 20 జనవరిన "పెంగ్విన్ అవగాహన దినం" పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. మానవ కదలికలు లేని ప్రదేశాల్లో స్వేచ్ఛగా జీవించగల పెంగ్విన్ పక్షుల మనుగడ కాలక్రమంలో ప్రశ్నార్థకంగా మారుతున్నది. పర్యావరణ కాలుష్యం, భూతాపం, ప్రతికూల వాతావరణ మార్పులు, అతిగా చేపలు పట్టడం, అవి నివసించే ప్రాంతాల్లో మానవ కదలికలు పెరగడం, మానవ అనవసర కదలికలతో పెంగ్విన్ పక్షుల ఉనికి ప్రమాదంలో పడుతున్నది. పర్యావరణ కాలుష్యాన్ని గుర్తించడానికి పెంగ్విన్ పక్షుల విచిత్ర ప్రవర్తనలు గమనించడం జరుగుతుంది.

పెంగ్విన్ అవగాహన దినం కార్యక్రమాలు:

పెంగ్విన్ అవగాహన దినం–2025 వేదికగా పెంగ్విన్ పక్షుల గూర్చి వివరాలను తెలుసుకోవడం, వాటికి సంబంధించిన వీడియోలను చూడడం, విద్యాలయాల్లో ఈ అరుదైన, అందమైన పక్షుల గూర్చి పోటీలు నిర్వహించడం, సమీప జంతు ప్రదర్శనశాలలకు వెళ్లి పెంగ్విన్ పక్షులను చూసి అబ్బురపడడం, వాతావరణ ప్రతికూల మార్పుల దుష్ప్రభావాలను వివరించడంతో కొనసాగాలి. దశాబ్దాలుగా మానవ తప్పిదాలతో పెంగ్విన్‌ల సంఖ్య గణనీయంగా పడిపోతున్నది.

ఈ విపరీత ప్రవర్తనలు ఇలాగే కొనసాగితే పెంగ్విన్‌లను ప్రత్యక్షంగా చూడడం మరిచి వీడియోలు, ఫోటోల్లో మాత్రమే చూసి తృప్తిపడే రోజులు రావద్దని, జీవ వైవిధ్య వ్యవస్థలను కాపాడడమే సురక్షిత మానవ మనుగడకు పునాది అని తెలుసుకుందాం, సౌందర్యరాశి అయిన పెంగ్విన్ పక్షులను అక్కున చేర్చుకుందాం.– **ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి**

9949700037

# మన గొప్ప బోడో సంప్రదాయాలను గౌరవిస్తున్న 'బగురుంబా ధహోవ్': ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 19:గౌహతిలోని సరుసజాయ్ స్టేడియంలో నిర్వహించిన బోడో చారిత్రాత్మక సాంస్కృతిక కార్యక్రమం 'బగురుంబా ధహోవ్ 2026'ను ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. అస్సాం సంస్కృతి చూడటం, బోడో సామాజిక వర్గ సంప్రదాయాలను నిశితంగా గమనించడం తన అదృష్టమని ప్రధాని వ్యాఖ్యానించారు. మరే ఇతర ప్రధానమంత్రి అస్సాంను తాను సందర్శించినంత తరచుగా సందర్శించలేదన్న ఆయన.. అస్సాం కళలు – సంస్కృతికి పెద్ద వేదిక లభించాలని, భారీ వేడుకల ద్వారా దేశవ్యాప్తంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాలని ఎల్లప్పుడూ కోరుకుంటున్నట్లు ప్రధానంగా చెప్పారు. ఈ దిశగా నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపిన ఆయన.. భారీ స్థాయిలో జరిగిన బిహు వేడుకలు, ఝుమోయిర్ వినోదిని ప్రదర్శన, ఏడాదిన్నర కిందట ఢిల్లీలో జరిగిన భారీ బోడో మహోత్సవ్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఉదహరించారు. అస్సాం కళలు, సంస్కృతి అందించే అనన్యమైన ఆనందాన్ని అనుభవించే ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోనని అన్నారు. బగురుంబా పండుగను నిర్వహించడంపై మరోసారి సంతోషం వ్యక్తం చేసిన ఆయన.. దీనిని బోడో అస్తిత్వానికి నిదర్శనంగా, అస్సాం వారసత్వ ప్రతీకగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న అందరికీ ముఖ్యంగా కళాకారులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

బగురుంబా దహోవ్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదన్న ప్రధానమంత్రి.. ఇది బోడో సంప్రదాయాన్ని గౌరవించడానికి, బోడో సమాజంలోని ప్రముఖులను స్మరించుకోవడానికి ఒక మాధ్యమమని పేర్కొన్నారు. సామాజిక సంస్కరణలు, సాంస్కృతిక పునరుజ్జీవనం, రాజకీయ చైతన్యానికి కృషి చేసిన బోడోఫా ఉపేంద్ర నాథ్ బ్రహ్మ, గురుదేవ్ కాళీచరణ్ బ్రహ్మ, రూపనాథ్ బ్రహ్మ, సతీష్ చంద్ర బసుమతారి, మోరాదమ్ బ్రహ్మ, కనకేశ్వర్ నర్జారీ వంటి మహనీయులను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బోడో సమాజంలోని గొప్ప వ్యక్తులందరికీ ప్రధానమంత్రి గౌరవపూర్వక నివాళులర్పించారు. అస్సాం సంస్కృతిని తమ పార్టీ దేశం మొత్తానికి గర్వకారణంగా భావిస్తుందన్న ఆయన.. అస్సాం చరిత్ర – వారసత్వం లేకుండా దేశ చరిత్ర అసంపూర్ణమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే బగురుంబా ధ్వౌ వంటి భారీ పండుగలను నిర్వహిసున్నామని.. బిహుకు జాతీయ గుర్తింపు లభించిందని.. 'చరాయిడియో మొయిదామ్'ను యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడానికి కృషి జరిగిందని ప్రధానంగా చెప్పారు. అస్సామీ భాషకు ప్రాచీన హోదా లభించిందనీ, బోడో భాషను అస్సాం సహ–అధికారిక భాషగా గుర్తించడంతో పాటు బోడో విద్యను బలోపేతం చేయడానికి ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తమ నిబద్ధత కారణంగా బథౌ ధర్మానికి పూర్తి గౌరవం, గుర్తింపు లభించాయన్న ఆయన.. బాథౌ పూజను రాష్ట్ర సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలోనే వీర యోధుడు లచిత్ బోర్ఫుకాన్ భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించటంతో పాటు బోడోఫా ఉపేంద్ర నాథ్ బ్రహ్మ విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు ఆయన గుర్తుచేశారు. శ్రీమంత శంకరదేవ ఇచ్చిన భక్తి, సామాజిక సామరస్య సంప్రదాయాలను అలాగే జ్యోతి ప్రసాద్ అగర్వాలా కళలు, చైతన్యాన్ని అస్సాం వారసత్వంలో భాగంగా గౌరవిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ రోజు జ్యోతి ప్రసాద్ అగర్వాలా వర్ధంతి అని గుర్తు చేసిన ప్రధాని.. ఆయనకు నివాళులర్పిస్తున్నట్లు తెలియజేశారు.

అస్సాం పర్యటన గురించి మాట్లాడిన ఆయన రాష్ట్రం ఇంతటి పురోగతిని సాధించడం చూసి తాను ఎంతో భావోద్వేగానికి లోనవుతున్నట్లు చెప్పారు. ఒకప్పుడు అస్సాంలో నిత్యం రక్తపాతం జరిగేదని కానీ నేడు సాంస్కృతి వెల్లివిరుస్తోందని, ఒకప్పుడు తుపాకుల మోత వినిపించేదని కానీ ఇప్పుడు 'ఖామ్', 'సిఫుంగ్' వంటి వాయిద్యాల మధుర ధ్వనులు వినిపిస్తున్నాయని.. ఒకప్పుడు కర్ఫ్యూ కారణంగా నిశ్శబ్దం రాజ్యమేలేదని కానీ ఇప్పుడు సంగీతం ప్రతిధ్వనిస్తోందని.. ఒకప్పుడు అశాంతి, అస్థిరత ఉండేవని కానీ నేడు బగురుంబాకు సంబంధించిన మనోహరమైన ప్రదర్శనలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇంతటి భారీ వేడుక కేవలం అస్సాం సాధించిన విజయం మాత్రమే కాదని ఇది భారత్ సాధించిన విజయమని అన్నారు. అస్సాం సాధించిన ఈ పరివర్తన పట్ల దేశంలోని ప్రతి ఒక్కరు గర్వపడుతున్నారని ప్రధాని ప్రముఖంగా చెప్పారు.

అస్సాం ప్రజలు, బోడో సోదరీసోదరులు తనపై ఉంచిన నమ్మకం పట్ల ప్రధానమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శాంతి, అభివృద్ధి బాధ్యతను అప్పగించారని.. ప్రజల దీవెనలతో ఆ బాధ్యత నెరవేరిందని ఆయన వ్యాఖ్యానించారు. 2020 బోడో శాంతి ఒప్పందం దశాబ్దాల తరబడి కొనసాగిన ఘర్షణలకు ముగింపు పలికిందని, నమ్మకాన్ని పునరుద్ధరించిందని ఆయన అన్నారు. వేలాది మంది యువకులు హింసను వీడి ప్రధాన స్రవంతిలో చేరేలా ఇది చేసిందని ప్రధానంగా పేర్కొన్నారు. ఒప్పందం తర్వాత బోడో ప్రాంతంలో విద్య, అభివృద్ధి రంగాలలో కొత్త అవకాశాలు పుట్టుకొచ్చాయన్న ఆయన.. ప్రజల కృషి అత్యంత కీలక పాత్ర పోషించడంతో శాంతి రోజువారీ జీవితంలో భాగమైందని అన్నారు.

అస్సాం శాంతి, అభివృద్ధి, గర్వం అనేవి శాంతి మార్గాన్ని ఎంచుకున్న స్థానిక యువత చుట్టూనే కేంద్రీకృతమై ఉన్నాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనిని ఉజ్వల భవిష్యత్తు వైపు ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. శాంతి ఒప్పందం జరిగినప్పటి నుంచి ప్రభుత్వం బోడోలాండ్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయటంతో పాటు పునరావాస ప్రక్రియను వేగవంతం చేసిందని అన్నారు. దీనితో పాటు వేలాది మంది యువకులు కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి కోట్లాది రూపాయల ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తోందని ఆయన పేర్కొన్నారు.

తమ ప్రభుత్వ ప్రయత్నాల ఫలితాలు నేడు కనిపిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. ప్రతిభావంతులైన బోడో యువత అస్సాం సాంస్కృతిక రాయబారులుగా మారుతున్నారని, క్రీడల్లో రాణిస్తున్నారని.. కొత్త ఆత్మవిశ్వాసంతో కలలు కనటంతో పాటు ఆ కలలను నెరవేర్చుకుంటూ రాష్ట్ర పురోగతిని ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు.

అస్సాం కళలు, సంస్కృతి, అస్తిత్వానికి గౌరవం లభించినప్పుడల్లా కొంతమంది ఇబ్బంది పడుతున్నారని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. 'అస్సాంకు దక్కే గౌరవాన్ని అభినందించని వారు ఎవరు?' అని అడిగిన ఆయన.. భూపెన్ హజారికాకు 'భారతరత్న' ఇవ్వడాన్ని వ్యతిరేకించింది ప్రతిపక్ష పార్టీయమేనని, అలాగే అస్సాంలో సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటును వ్యతిరేకించింది కూడా వారేనని అన్నారు. నేడు కూడా తాను అస్సాం సంస్కృతికి సంబంధించిన దుస్తులు, వస్తువులను ధరించినప్పుడు ఎగతాళి చేసేది ప్రతిపక్షమేనని ప్రధాని వ్యాఖ్యానించారు.

కేవలం ప్రతిపక్షాల వల్లే అస్సాం, బోడోలాండ్ దశాబ్దాల పాటు ప్రధాన స్రవంతికి దూరంగా ఉండిపోయాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రధానంగా చెప్పారు. వారు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అస్సాంలో అస్థిరతను సృష్టించారని.. రాష్ట్రాన్ని హింస అనే మంటల్లోకి నెట్టేశారని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అస్సాం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ఆయన.. అయితే అప్పటి పాలకులు సమస్యలకు పరిష్కారాలు కనుగొనడానికి బదులు ఆ సమస్యలనే రాజకీయ లబ్ధి కోసం వాడుకున్నారని గుర్తు చేశారు. ప్రతిపక్ష పార్టీని విమర్శించిన ఆయన.. నమ్మకం అవసరమైనప్పుడు వారు విభజన బీజాలు నాటారని, చర్చలు జరపాల్సిన సమయంలో వాటిని నిర్లక్ష్యం చేసి సంప్రదింపుల తలుపులు మూసివేశారని ప్రముఖంగా చెప్పారు. బోడోలాండ్ స్వరం ఎప్పుడూ సరైన రీతిలో వినబడలేదని ఆయన పేర్కొన్నారు. అస్సాంకు సాంత్వన, సేవ అవసరమైనప్పుడు దానికి బదులుగా చొరబాటుదారుల కోసం ద్వారాలు తెరిచి వారిని స్వాగతించడంపైనే దృష్టి సారించారని ఆయన అన్నారు.

ప్రతిపక్ష పార్టీ అస్సాం ప్రజలను తమ సొంతవారిగా భావించదని.. తమకు విధేయంగా ఉంటూ ఓటు బ్యాంకుగా మారే విదేశీ చొరబాటుదారులకే ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెప్పారు. ప్రతిపక్షాల పాలనలో చొరబాటుదారులు వస్తూనే ఉన్నారన్న ప్రధాని.. వారు లక్షలాది బిగాల భూమిని ఆక్రమించుకున్నారని.. వారికి అప్పటి ప్రభుత్వాలు సహాయం చేశాయని అన్నారు. నేడు శ్రీ హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలో ప్రభుత్వం లక్షలాది బిగాల భూమిని చొరబాటుదారుల నుంచి విడిపించి అస్సాం అసలైన వారసులకు తిరిగి అప్పగిస్తున్నందుకు ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఎల్లప్పుడూ అస్సాం, మొత్తం ఈశాన్య భారత్‌ను నిర్లక్ష్యంతో చూశాయన్న ఆయన.. అవి ఇక్కడి అభివృద్ధిని ఎన్నడూ ముఖ్యమైనదిగా భావించలేదని, ఉద్దేశపూర్వకంగా ఆ ప్రాంతాన్ని కష్టాల్లోకి నెట్టాయని ఆయన ప్రముఖంగా చెప్పారు.

ప్రతిపక్షాలు చేసిన పాపాలను కడిగివేసే పనిని కేంద్ర, రాష్ట్రాల్లోని తమ ప్రభుత్వాలు చేస్తున్నాయని.. నేడు కనిపిస్తున్న అభివృద్ధి వేగమే దానికి నిదర్శనమని ప్రధానమంత్రి అన్నారు. బోడో–కచారి సంక్షేమ స్వయంప్రతిపత్తి మండలి ఏర్పాటు, బోడోలాండ్ కోసం రూ. 1500 కోట్ల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కేటాయింపు, కోక్రాఝర్‌లో మెడికల్ కాలేజ్ – హాస్పిటల్ ఏర్పాటు, అలాగే తాముల్పూర్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని వేగవంతం చేయడం వంటి అంశాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. నర్సింగ్ కాలేజీలు, పారామెడికల్ సంస్థలు యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయన్న ఆయన.. గోబర్ధన, పర్బత్‌ఝోరా, హరిసింగా ప్రాంతాలలో పాలిటెక్నిక్, శిక్షణ సంస్థలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

బోడో సామాజిక వర్గ సంక్షేమం కోసం మెరుగైన విధాన రూపకల్పనకు వీలు కల్పించేలా ప్రత్యేక సంక్షేమ శాఖ, 'బోడోలాండ్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ'ని కూడా ఏర్పాటు చేసినట్లు ప్రధాని చెప్పారు. మెరుగైన మౌలిక సదుపాయాల ద్వారా తమ ప్రభుత్వం ప్రజల మనసుల మధ్య, అస్సాం – ఢిల్లీ మధ్య, అలాగే అస్సాం లోపల ఉన్న దూరాలను తగ్గించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఒకప్పుడు చేరుకోవడం కష్టంగా ఉన్న ప్రాంతాలకు ఇప్పుడు రహదారులు వచ్చాయన్న ఆయన.. కొత్త రోడ్లు మరిన్ని అవకాశాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. కోక్రాఝర్‌ను భూటాన్ సరిహద్దుతో కలిపే బిష్మరి–సరల్‌పరా రహదారి ప్రాజెక్టు, దీని కోసం కేటాయించిన కోట్లాది రూపాయలతో పాటు ప్రతిపాదిత కోక్రాఝర్–గెలెఫు రైలు ప్రాజెక్టును ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. ఈ రైలు ప్రాజెక్టును 'ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు'గా ప్రకటించి 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'లో భాగం చేయడం వల్ల వాణిజ్యం, పర్యాటకం గణనీయంగా పెరుగుతాయని ఆయన తెలిపారు.

సమాజం మూలాలతో అనుసంధానమై ఉన్నప్పుడు, చర్చలు – నమ్మకం బలంగా ఉన్నప్పుడు, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు లభించినప్పుడు సానుకూల మార్పు కనిపిస్తుందని ప్రధానమంత్రి ప్రముఖంగా చెప్పారు. అస్సాం, బోడోలాండ్ ఈ దిశగానే పురోగమిస్తున్నాయన్న ఆయన.. అస్సాం ఆత్మవిశ్వాసం, సామర్థ్యం, పురోగతి భారతదేశ వృద్ధి కథనానికి కొత్త బలాన్ని ఇస్తున్నాయని పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో అస్సాం ఒకటిగా నిలుస్తోందన్న ఆయన.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటోందని, ఈ పరివర్తనలో బోడోలాండ్– స్థానిక ప్రజలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. నేటి ఈ భారీ వేడుకను పురస్కరించుకొని ప్రధానమంత్రి మరోసారి అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అస్సాం గవర్నర్ శ్రీ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, అస్సాం ముఖ్యమంత్రి శ్రీ హిమంత బిశ్వ శర్మ.. కేంద్ర మంత్రులు శ్రీ సర్బానంద సోనోవాల్, శ్రీ పవిత్ర మార్గ రీటా.. ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

గౌహతిలోని సరుసజాయ్ స్టేడియంలో బోడో సామాజిక వర్గ గొప్ప వారసత్వాన్ని చాటి చెప్పే చారిత్రాత్మక సాంస్కృతిక కార్యక్రమం 'బగురుంబా ధహోవ్ 2026'లో ప్రధానమంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బోడో సామాజిక వర్గానికి చెందిన 10,000 మందికి పైగా కళాకారులు ఒకే వేదికపైన సమన్వయంతో 'బగురుంబా' నృత్యాన్ని ప్రదర్శించారు. రాష్ట్రంలోని 23 జిల్లాల నుంచి 81 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కళాకారులు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

ప్రకృతి నుంచి గాఢ ప్రేరణ పొందిన బగురుంబా.. బోడో సామాజిక వర్గానికి చెందిన జానపద నృత్యాలలో ఒకటి. వికసించే పువ్వుల మాదిరిగా ఉండే ఈ నృత్యం మానవ జీవితం, ప్రకృతికి మధ్య ఉన్న సామరస్యాన్ని తెలియజేస్తోంది. సంప్రదాయ యువ బోడో మహిళలు ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. పురుషులు సంగీతకారులుగా ఉంటారు. సీతాకోకచిలుకలు, పక్షులు, ఆకులు, పువ్వుల కదలికలను అనుకరించే మృదువైన కదలికలే ఈ నృత్యానికి ఉన్న ప్రత్యేకత. సాధారణంగా సమూహాలుగా వలయాకారంలో లేదా వరుసలలో నిర్వహించే ఈ ప్రదర్శనలు చూసేందుకు అత్యంత అందంగా ఉంటాయి.

బోడో ప్రజల విషయంలో బగురుంబా నృత్యానికి లోతైన సాంస్కృతిక ప్రాముఖ్యత ఉంది. శాంతి, సంతానోత్పత్తి, ఆనందం, సామూహిక సామరస్యాన్ని సూచించే ఈ నృత్యం బోడో కొత్త సంవత్సరం 'బైసాగు', 'డొమాసి' వంటి పండుగలతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంది.

## న్యాయం కోసం రైతు ఆత్మహత్యాయత్నం..!

### –అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టిన హృదయ విదారక ఘటన

చిత్తూరు, జనవరి 19: న్యాయం కోసం ఏళ్ల తరబడి తిరిగిన ఒక రైతు చివరికి ప్రాణాలపైకి తెచ్చుకున్నాడు. వెదురు కుప్పం మండలం మాంబేడు గ్రామానికి చెందిన నాగరాజు తన భూమి విషయంలో ఎదుర్కొంటున్న అన్యాయంపై స్పందించని అధికార యంత్రాంగం తీరుకు నిరసనగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ రోజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాగరాజుకు ఎదురు కుప్పం మండలం మాంబేలు గ్రామంలో డీకేటి భూమితో పాటు, 1.05 ఎకరాల సెటిల్మెంట్ భూమి ఉంది.

కొంతకాలం క్రితం వెదురు కుప్పం మండలానికి చెందిన జడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ దళిత డీకేటి భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారని నాగరాజు ఆరోపిస్తున్నాడు. అంతేకాదు, తన సెటిల్మెంట్ పొలంలోకి కూడా అడుగుపెట్టనివ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోయాడు.

# ఘనంగా యోగివేమన జయంతి

### –పూలమాల వేసిన సీపీ రాజశేఖర్ బాబు

విజయవాడ, జనవరి 19: యోగివేమన జయంతి సందర్భంగా ఎన్.టీ.ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు యోగివేమన చిత్రపటానికి



పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యోగివేమన చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడని ఆయన పేర్కొన్నారు.

సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే సరళమైన భాషలో పద్యాలు రచించి ప్రజలను చైతన్యపరిచిన మహాకవిగా యోగివేమనను అభివర్ణించారు. వేమన పద్యాలు వినని, తెలియని వారు లేరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. యోగివేమన జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించడం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు శ్రీ కృష్ణ కాంత్ పటేల్, కేజీవీ. సరిత,సీపీఓ అధికారులు, పోలీస్ అధికారులు, సీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొని యోగివేమనకు ఘన నివాళులు అర్పించారు.

# మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు

మహబూబ్‌నగర్, జనవరి 19: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 6 వ వార్డుకు చెందిన ఎరుకలి శివరాజ్ ఆధ్వర్యంలో చందాపురం గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన చెందిన కార్యకర్తలు మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ లో చేరారు.

మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచి మున్సిపల్‌పై గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. ఇచ్చిన మాట తప్పిన పార్టీకి బుద్ధి రావాలంటే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. మక్తల్ మున్సిపాలిటీని తీసుకువచ్చిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకి దక్కుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి నరసింహా గౌడ్, పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, ప్రధాన కార్యదర్శి సందాపురం అశోక్ కుమార్ గౌడ్, తిర్మాలపూర్ కృష్ణ యాదవ్, సిరిపేరాములు ఆంజనేయులు గౌడ్, కుర్మన్నయాదవ్ , దొడ్డి రామలింగం, సిరిపే మోనేష్, దొడ్డి గోవిందు, నాగరాజు గరాజు వాబీ, బాబు, నర్సింహా, ఎరుకలి ఉ సేనప్ప తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలపై అవగాహన..



నారాయణపేట, జనవరి 19: నారాయణపేట జిల్లా మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్రివ్ అలీవ్ కార్యక్రమంలో భాగంగా జక్లేర్ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన జక్లేర్ గ్రామానికి చెందిన హుస్సేన్ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని, వాహనదారులు, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై వై.భాగ్య లక్ష్మి రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నియమాలను నిర్లక్ష్యం చేయడమేనని అన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, ట్రాఫిక్ సంకేతాలను గౌరవించాలని, నిర్దేశిత వేగ పరిమితిని పాటించాలని సూచించారు.

ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను పరిగణలోకి తీసుకొని వాహనాలు నడపాలని అన్నారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. రోడ్డు భద్రత అనేది ఒకరి బాధ్యత కాదనీ, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించి నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. అర్రివ్ అలీవ్ కార్యక్రమం ఉద్దేశ్యం ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆకాశమే హద్దుగా 'వింగ్స్ ఇండియా-2026': ఆసియాలోనే అతిపెద్ద ప్రపంచ విమానయాన భవిష దార్శనిక పౌర విమానయాన ప్రదర్శన

న్యూఢిల్లీ, జనవరి 19:ఆసియాలోనే అతిపెద్ద పౌర విమానయాన కార్యక్రమం 'వింగ్స్ ఇండియా-2026' పౌర విమానయాన మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు నేతృత్వాన ఘనంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో దేశవిదేశాల నుంచి హాజరవుతున్న ఉన్నత స్థాయి ప్రముఖుల సమక్షంలో జనవరి 28న వైభవోపేతంగా మొదలయ్యే ఈ ప్రపంచ విమానయాన ప్రదర్శన 31వ తేదీ వరకూ 4 రోజుల పాటు కొనసాగుతుంది.

"భారతీయ విమానయానం: డిజైన్ నుంచి విస్తరణ.. తయారీ నుంచి నిర్వహణ.. సార్వజనీనత నుంచి ఆవిష్కరణ.. భద్రత నుంచి సుస్థిరత వరకూ భవిష్యత్తుకు మార్గం సుగమం" ఇతివృత్తంగా సాగే 'వింగ్స్ ఇండి యా-2026'లో శరవేగంగా విస్తరిస్తున్న భారత విమానయాన రంగం భవిష్యత్తు, దాని అంతర్జాతీయ ప్రాచుర్యం ప్రస్ఫుటం అవుతాయి. దీంతోపాటు తయారీ, సేవలు, ఆవిష్కరణ, సుస్థిర విమానయాన సమగ్ర సేవల కీలక కూడలిగా ఎదగాలనే దృక్కోణాన్ని ప్రముఖంగా చాటుతుంది.

### విమానయానానికి అత్యున్నత ప్రపంచ వేదిక

వింగ్స్ ఇండియా-2026 ఒక విస్తృత అంతర్జాతీయ ప్రదర్శన.. ఇందులో వివిధ రకాల విమానాలను చూడవచ్చు. దీంతోపాటు ఆకాశ విహారం, గగనంలో విమాన విన్యాసాలను కూడా తిలకించవచ్చు. అలాగే, ఉన్నత స్థాయి అంతర్జాతీయ సమావేశం, 'సీఈఓ'ల రౌండ టేబుల్ సదస్సులు, 'బి2బి' (బిజినెస్ టు బిజినెస్) భేటీలు, విమానయాన సిబ్బంది ఎంపిక, అవార్డుల వేడుక, ఉత్సాహభరిత సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఇందులో అంతర్భాగంగా ఉంటాయి. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు, భాగస్వాములు ఇందులో పాలుపంచుకుంటారు. తద్వారా ప్రపంచంలోనే అగ్రశ్రేణి విమానయాన వేదికగా ఈ కార్యక్రమ స్థాయి ఇనుమడిస్తుంది.

విమానయాన విలువ వ్యవస్థలోని ప్రసిద్ధ దేశవిదేశీ భాగస్వామ్య సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటాయి. ఈ మేరకు విమానయాన సంస్థలు, విమానాలు, ఇంజిన్ తయారీదారులు, 'ఎంఆర్ఓ'లు, విమానాశ్రయ నిర్మాణ సంస్థలు, 'ఓఈఎం'లు, సాంకేతికత ప్రదాతలు, శిక్షణ సంస్థలు, సేవా ప్రదాతలు ఇందులో అంతర్భాగంగా ఉంటారు. భారత్ సహా అంతర్జాతీయంగా పౌర విమానయాన భవిష్యత్తును రూపుదిద్దగల ఆధునిక ధోరణులు, అవకాశాలు, సహకార మార్గాలపై ఈ కార్యక్రమంలో చర్చలుంటాయి. విధాన నిర్ణేతలు, అగ్ర పారిశ్రామి కవేత్తలు, ఆవిష్కర్తలు, పెట్టుబడి దారులు పాల్గొనే ఈ చర్చలన్నిటికీ 'వింగ్స్ ఇండియా-2026 ఒక సమన్వయ వేదికగా మారుతుంది.

ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో ప్రపంచ 'సీఈఓ'ల వేదిక, మంత్రివర్గ స్థాయి సమావేశాలతోపాటు 13 ఇతివృత్తాధారిత చర్చా గోష్ఠులుంటాయి. విమానాశ్రయాలు, విమానాల లీజింగ్, హెలికాప్టర్లు, ఎయిర్ లైన్స్, పౌరవిమాన యానంలో మహిళలు, 'ఎంఆర్ఓ', విమానాల్లో సరకు రవాణా, వాణిజ్య విమానయానం, చిన్న విమానాలు, విమాన విడిభాగాల తయారీ, సుస్థిర విమాన ఇంధనం, పైలట్ శిక్షణ-నైపుణ్యాభివృద్ధి, అత్యాధునిక విమాన రవాణా, డ్రోన్స్ తదితర కీలక రంగాలు కూడా ఈ సదస్సు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉంటాయి.

బలమైన జాతీయ- అంతర్జాతీయ భాగస్వామ్యం

ఈ సదస్సులో మంత్రిత్వ స్థాయి విదేశీ ప్రతినిధులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, 20కిపైగా దేశాల నుంచి అధికారిక ప్రతినిధులు పాల్గొంటారు. ఈ విమానయాన రంగంలో అంతర్జాతీయ సహకారం, సంయుక్త కృషిని ఇది బలోపేతం చేస్తుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలు కూడా ఇందులో చురుగ్గా పాల్గొంటున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా విమానయాన చోదక వృద్ధి, పెట్టుబడి అవకాశాలు, మౌలిక సదుపాయాల పురోగమనాన్ని ఈ సదస్సు ప్రతిబింబిస్తుంది.

### అద్భుత విమాన విన్యాసాలు.. ఆధునిక విమానాల ప్రదర్శన

వింగ్స్ ఇండియా-2026లో ఆకట్టుకునే ఆధునిక విమానాల ప్రదర్శనతోపాటు విమాన విహారం, గగనతల విన్యాసాలు కూడా ఉంటాయి. విస్తృత శ్రేణి విమానాలను ప్రతినిధులకు చూపడంతోపాటు భారత వైమానిక దళ 'సూర్య కిరణ్' విన్యాస బృందం ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో ఆకట్టుకోనుంది.

వివిధ రకాల ప్రదర్శనలు, ఆకర్షణీయ ఆతిథ్య గృహాలు (చాలెట్), 'బి2బి-బి2జి' సమావేశాలకు ఈ కార్యక్రమం ప్రత్యేక వేదికలను సమకూరుస్తుంది. వ్యాపార నెట్‌వర్కింగ్, భాగస్వామ్యాలు, పెట్టుబడి సంబంధిత చర్చలకు వెసులుబాటు కల్పిస్తుంది. ఇక విమానయాన సిబ్బంది ఎంపిక కార్యక్రమం యువ నిపుణులతో పాటు విమానయాన వ్యవస్థలోగల ప్రతిభావంతులైన నిపుణులను ఈ రంగంలోని అగ్రగామి పారిశ్రామిక సంస్థలతో అనుసంధానిస్తుంది.

విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పౌర విమానయాన ఆవిష్కరణ పోటీ నిర్వహిస్తారు. విద్యార్థులు, యువ నిపుణులలో ఆవిష్కరణ, సమస్య పరిష్కారం, పరిశ్రమ-ఆధారిత ఆలోచనలను ప్రోత్సహించడం దీని లక్ష్యం. అలాగే, ప్రపంచ విమానయానంలో వాస్తవిక సవాళ్లు-అవకాశాలను కూడా వారికి పరిచయం చేయడంలోనూ ఇది దోహదం చేస్తుంది.

సుసంపన్న భారత వారసత్వాన్ని ప్రతిబింబించే ఉత్సాహభరిత సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఈ కార్యక్రమంలో భాగంగా ఉంటాయి. ప్రతినిధులు, సందర్శకులకు విమానయాన ప్రదర్శనల ఉల్లాసానికి ఒక వినూత్న ఆనందానుభూతిని ఈ ప్రదర్శనలు జోడిస్తాయి.

పౌర విమానయానంలో అత్యుత్తమ ప్రతిభకు, కృషికి గుర్తింపునిచ్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రతిష్టాత్మక పురస్కార ప్రదానోత్సవం కూడా నిర్వహిస్తారు.

వింగ్స్ ఇండియా-2026 తన భారీ స్థాయి, వైవిధ్యం, వ్యూహాత్మక దృక్కోణం ద్వారా భారత విమానయాన వృద్ధి క్రమాన్ని ప్రదర్శించడంతోపాటు ప్రపంచ భాగస్వామ్యాలను బలోపేతం చేస్తుంది. అలాగే, ఆవిష్కరణలకు సారథ్యం వహిస్తూ, పౌర విమానయాన రంగానికి భవిష్యత్ పథనిర్దేశం చేస్తుంది.

# సీఎం హోదాలో కూతలు మానాలి : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, జనవరి 19: హామీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమయ్యిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి చిల్లర కూతలు కూయడం మానుకోవాలని రేవంత్ రెడ్డికి సూచించారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సహచర మంత్రులతో ఉన్న విభేదాలతో ఏమి చేయాలో పాలుపోక వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి సీఎం చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ గద్దెలు కూల్చాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితమని వెల్లడించారు. బీఆర్ఎస్ గద్దెలపై చేయి పడితే కాంగ్రెస్ పార్టీని వందమీటర్ల లోతున బొందపెడతారని మరోసారి స్పష్టం చేశారు.

కాంగ్రెస్, టీడీపీ పాలనలో అసమానతలు, వివక్ష మూలంగానే తెలంగాణ ఉద్యమం మొదలయింది, టీడీపీ, కాంగ్రెస్ మోసం మూలంగానే తెలంగాణ బిడ్డలు అమరులయ్యారని అన్నారు.

# ఊట్కూర్ మండల కేంద్రాన్ని ముంపు గ్రామంగా ప్రకటించండి..

## -ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన నాయకులు

ఊట్కూర్, జనవరి 19: నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకంలో ఊట్కూర్ పెద్ద చెరువు రిజర్వాయర్ గా మారుస్తున్న నేపథ్యంలో నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని ఈ రోజు ప్రజావాణిలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఊట్కూర్ పెద్ద చెరువు ప్రస్తుతం ఉన్న నీటి సామర్థ్యంతోనే గ్రామ పరిసరాల్లో ఇండ్లు నిర్మించినందుకు పునాదులు తవ్వితే నీటి ఊట వస్తుందని పేర్కొన్నారు.



రిజర్వాయర్ గా మారిస్తే రానున్న కాలంలో పెద్ద చెరువు గ్రామానికి ముంపు నష్టం పొంచిఉందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ఎత్తిపోతల పథకంతో భూములకు సాగునీరు అందుతున్న గ్రామం లో నివసిస్తున్న ప్రజలకు ముంపు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ పనులు ప్రారంభించక ముందు ఊట్కూర్ ను ముంపు గ్రామంగా ప్రకటించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అందుకు కలెక్టర్ సిక్తాపట్నాయక్ స్పందించి ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించి ఊట్కూర్ రిజర్వాయర్ ఏర్పడితే జరిగే నష్టంపై నివేదిక ఇచ్చేందుకు ప్రత్యేక కమిటీ వేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఊట్కూర్ మండల కేంద్రంలో కుక్కల దాడి విపరీతంగా మారడంతో పాటు చిన్న పిల్లలు పశువులపై దాడి చేస్తున్నాయని కలెక్టర్ కు మొరపెట్టుకున్నారు.

కుక్కల దాడి నుండి నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. ఎంపీడీవో తో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, వార్డు సభ్యులు నరేష్, కొక్కు మల్లేష్, బీజేపీ నాయకులు బోయిని రవి, తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ మున్సిపల్ ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ గెలుపు ఖాయం..

## –షకీల్ నాయకత్వంలో 36 కౌన్సిలర్ స్థానాలు బీఆర్ఎస్‌వే
## –కేసీఆర్ మాత్రమే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష
## –బోధన్ ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం ఖాయం

నిజామాబాద్, జనవరి 19: బోధన్ పట్టణ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, షకీల్ హయాంలో మంజూరైన పనులను కూడా నిలిపివేసి ప్రజలను శిక్షిస్తోందని, త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర అన్నారు. బోధన్ పట్టణంలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ బోధన్ టౌన్ మీటింగ్ చూస్తుంటే నియోజకవర్గ, జిల్లా స్థాయి సభలా ఉందని, ప్రజల ఉత్సాహం చూస్తుంటే బోధన్ మున్సిపాలిటీపై మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.




షకీల్ నాయకత్వంలో 36 మంది కౌన్సిలర్లు భారీ మెజారిటీతో గెలవడం తథ్యమన్నారు. కేసీఆర్, కేటీఆర్ సహకారంతో షకీల్ బోధన్ అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయించారని, అందులో రూ.60 కోట్ల పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. అయితే గత రెండేళ్లుగా ఇక్కడి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన రూ.40 కోట్ల పనులను చేయకుండా అడ్డుకుందని విమర్శించారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారినా కనీసం మరమ్మతులు కూడా చేయలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కేవలం దోచుకోవడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. సివిల్ సప్లైస్, లిక్కర్, బొగ్గు కుంభకోణాల్లో మంత్రులు, సీఎం వాటాల కోసం కొట్టుకుం టున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రేవంత్ రెడ్డిల మధ్య వాటాల పంపకాల్లో తేడాలు వచ్చి రోడ్డున పడ్డారని ఎద్దేవా చేశారు. షకీల్ హయాంలో పగడపల్లి వద్ద నదిపై చెక్ డ్యాం నిర్మించి రైతులకు మేలు చేశామని, ఇప్పుడున్న ఇరిగేషన్ శాఖ మంత్రి, స్థానిక పెద్ద మనుషులు ఒక్క కొత్త చెక్ డ్యాం ఎందుకు కట్టలేక పోయారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ పట్టుకొని తిరిగిన చరిత్ర రేవంత్ రెడ్డిదని, అటువంటి వ్యక్తికి బీఆర్ఎస్ జెండాను తాకే నైతిక అర్హత లేదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయి నుంచి కింది స్థాయి కార్యకర్త వరకు కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. గత రెండేళ్లలో కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు.

తెలంగాణ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కొనడానికి డబ్బు సంచులతో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని, ఆయన ఒక తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. చంద్రబాబు నాయుడు చెప్పుచేతల్లో నడిచే రేవంత్ రెడ్డికి తెలంగాణ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కు చంద్రబాబు నాయుడు అడ్డు పడ్డాడు కాబట్టే తెలంగాణా ప్రజలు తెలుగుదేశం పార్టీని తెలంగాణ నుండి ఆంధ్రకు పంపించారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు, వృద్ధులకు ఇచ్చిన మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతీ మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఈ రెండేళ్లలో ఆ డబ్బులు ఇవ్వకుండా మహిళలను మోసం చేశారు. అంటే ఒక్కో మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 60,000 బాకీ పడిందని ప్రశాంత్ రెడ్డి లెక్కలతో సహా వివరించారు. రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీల వీడియోలను (పెన్షన్ పెంపు, మహిళలకు ఆర్థిక సాయం) ప్రతి ఇంటికి వెళ్లి చూపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాట తప్పిన కాంగ్రెస్ కు ఓటు ఎందుకు వేయాలని, ప్రజలు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ మాత్రమే శ్రీరామరక్ష అని, బీఆర్ఎస్ పార్టీని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బోధన్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

టికెట్ ఎవరికి వచ్చినా, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని గెలిపించాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బోధన్ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు షకీల్, గణేష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, గిర్దవర్ గంగారెడ్డి, నర్సింగ్ రావు మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు, పార్టీ ప్రతినిధులు, పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఆరంభంతో తన ఉనికి విస్తరణ



హైదరాబాద్, జనవరి 19: లాంగిట్యూడ్ 77, పెర్నాడ్ రికార్డ్ ఇండియా నుండి ఇండియన్ సింగిల్ మాల్ట్, హైదరాబాద్ లో విజయవంతంగా ప్రారంభించింది, తమ సుసంపన్నమైన భారతదేశపు కళాపనితనం మరియు అంతర్జాతీయ నైపుణ్యతతో హైదరాబాద్ కి చెందిన అర్హత కలిగిన విజ్ఞులను ఆకర్షిస్తోంది. హైదరాబాద్ లోని ద తాజ్ ఫలక్‌నుమా పాలెస్ లో ఒక ప్రత్యేకమైన కార్యక్రమం ద్వారా ఈ విడుదల సంబరం జరిగింది. వాస్తవమైన, సమకాలీన భారతదేశపు విలాసం యొక్క సాటిలేని అనుభవాన్ని అతిథులకు అందిస్తోంది.

తమ సాటిలేని నాణ్యత కోసం అంతర్జాతీయంగా గుర్తించబడిన లాంగిట్యూడ్ 77 ప్రతిష్టాత్మకమైన ప్రశంశలను అందుకుంది. వీటిలో లండన్ స్పిరిట్స్ పోటీలో బంగారు పతకం, ద స్పిరిట్స్ బిజినెస్ మరియు మోండే సెలక్షన్ ద్వారా ద గ్లోబల్ స్పిరిట్స్ మాస్టర్స్ మరియు ద ఇంటర్నేషనల్ వైన్ & స్పిరిట్స్ పోటీలో కాంశ్య పతకం ఉన్నాయి. ఈ అవార్డ్స్ శ్రేష్టత పట్ల బ్రాండ్ యొక్క అచంచలమైన నిబద్ధతను మరియు ప్రపంచంలోని ఉత్తమమైన విస్కీలలో దీని యొక్క పెరుగుతున్న ఖ్యాతిని చూపిస్తున్నాయి. లాంగిట్యూడ్ 77 యొక్క కేంద్రంలో అసాధారణమైన కళాపనితనం యొక్క వారసత్వం ఉంది. షివాస్, గ్లెన్ లివెట్, మరియు జేమ్సన్ వంటి దిగ్గజపు ప్రపంచ పేర్ల వెనక ఉన్న మాస్టర్ విస్కీ తయారీదారులచే రూపొందిన లాంగిట్యూడ్ 77, రెండు శతాబ్దాలకు పైగా విస్కీ తయారీ వారసత్వాన్ని తీసుకుంది. ప్రతి బాటిల్ లో తరతరాలుగా ఉన్న నైపుణ్యం, ఆవిష్కరణ మరియు కళాత్మకతను నింపుతు ంది.

ప్రసిద్ధి చెందిన విస్కీ నిపుణుడు జిమ్ ముర్రే మాటల్లో, " లాంగిట్యూడ్ 77 స్పష్టత, సమతుల్యత మరియు సంక్లిష్టతను శ్రమ లేకుండా నైపుణ్యంతో ప్రదర్శిస్తుంది- ఇది ఉత్తమమైన పనితనానికి నిజమైన ప్రతిబింబం. లిక్విడ్ గోల్డ్ ప్రామాణంలో ఉంటుంది; నా విస్కీ బైబిల్ లో దీనికి 94 పాయింట్లు ఇచ్చి ఉండే వాడిని. ఇది నేను ఎన్నడూ రుచి చూడని కొన్ని ఉత్తమమైన స్కాచ్ బ్లెండ్స్ మరియు సింగిల్ మాల్ట్స్ తో సమానంగా నిలిచింది. నాసిక్ పర్వత శ్రేణుల్లోని సహజమైన ఉష్ణోగ్రత మార్పుల ద్వారా సరైన సమయంలో జరిగిన పరిపక్వత ఒక అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చింది. అంతర్జాతీయ విస్కీ పరిస్థితిలో ఈ విస్కీ భారతదేశంలో ఒక గంభీరమైన భాగస్వామిగా అభివృద్ధి చెందడానికి రుజువుగా నిలిచింది మరియు సాటిలేని నాణ్యత, విలక్షణత మరియు నాణ్యతతో స్పిరిట్స్ ను రూపొం దించడంలో దేశం యొక్క సామర్థ్యాన్ని చూపిస్తోంది".

మహేష్ పాటిల్, లాంగిట్యూడ్ 77 యొక్క మాస్టర్ బ్లెండర్ ఇలా అన్నారు, "అభిరుచి మరియు ఖచ్చితత్వం యొక్క ప్రయాణంతో భారతదేశపు విలక్షణమైన సహజత్వాన్ని వేడుక చేస్తానే శతాబ్దాలుగా ఉన్న స్వచ్ఛత నైపుణ్యం నుండి లాంగిట్యూడ్ 77ని రూపొం దించబడింది. భారతదేశపు సారాంశం నిజంగా గ్రహించే ప్రపంచ స్థాయికి చెందిన సింగిల్ మాల్ట్ ను తయారు చేయడానికి ప్రతి బ్యాచ్ (ఃజీబిఇష్ట్ర) మా నిబద్ధతను సూచిస్తుంది. చల్లని, దిండోరి నాసిక్ పొడి వాతావరణం అమెరికన్ బోర్బన్ పీపాలు మరియు వైన్ కాస్క్‌లలో సూక్ష్మమైన రెట్టింపు పరిపక్వత ప్రక్రియతో కలపబడింది, లాంగిట్యూడ్ 77ని నిర్వచించే విలక్షణమైన మృదుత్వం మరియు సంక్లిష్టతలను సృష్టించింది. ప్రీమియం కళాపనితనం గురించి నిజంగా అర్థం చేసుకుని మరియు విలువనిచ్చే హైదరాబాద్ నగరంలో విజ్ఞులచే ప్రశంశించబడిన ఈ సాటిలేని లిక్విడ్ ను చూడటం నాకు ఎంతో గర్వంగా ఉంది."

తాజ్ లో ఈ సాయంత్రం హైదరాబాద్ యొక్క విభిన్నమైన రుచులను చూపించింది, సమకాలీన, ఆవిష్కరణ సమర్పణలు ద్వారా పునః ఊహించబడింది. ప్రత్యేకమైన లాంగిట్యూడ్ 77ని ) రుచి చూసే అనుభవం, ప్రాంతానికి చెందిన విలక్షణమైన సహజత్వాన్ని వేడుక చేయడంతో ఈ కార్యక్రమం ముగిసింది. భారతదేశంవ్యాప్తంగా లాంగిట్యూడ్ 77 జాగ్రత్తగా ప్రణాళిక చేయబడిన విస్తరణ వ్యూహంలో భాగంగా ఈ ఆవిష్కరణ జరిగింది. ప్రీమియం విస్కీని వినియోగించే శక్తివంతమైన సంభావ్యత కలిగిన మార్కెట్లపై దృష్టి కేంద్రీకరించింది.

భారతదేశం వెంట వెళ్లే 77లీ తూర్పు రేఖాంశం పేరు పొందిన, లాంగిట్యూడ్ 77 ఆవిష్కరణ మరియు ప్రపంచ స్థాయికి చెందిన దేశీయ ఉత్పత్తికి పెర్నాడ్ రికార్డ్ ఇండియా వారి నిబద్ధతను చూపిస్తోంది. ఈ ప్రీమియం భారతదేశపు సింగిల్ మాల్ట్ స్థానికంగా సేకరించిన పదార్థాలను ఉపయోగించి చిన్న బ్యాచ్‌లుగా రూపొందించబడింది మరియు అమెరికన్ బోర్బన్ పీపాలు మరియు వైన్ కాస్క్‌లలో రెట్టింపు పరిపక్వం చేయబడింది. నాసిక్ లోని దిండోరి అదనంగా పరిపక్వం చేయబడింది. ఫలితంగా మృదువైన, సుసంపన్నమైన మహోగని స్పిరిట్ కారామెల్, వెనిల్లా మరియు పీట్ పొగ రుచులను కలిగి ఉంటుంది. నీలి రంగులో మ్యాటీ ఫినిష్ పెట్టెలో అందించబడింది- ఇది భారతదేశం ప్రపంచానికి అందించిన రంగుకు సూచిక. బాటిల్ పై ఉత్తర దిశ నుండి దక్షిణ దిశకు వెళ్తున్న 77లీ రేఖాంశంతో విలక్షణమైన మ్యాప్ స్టాంప్ ఉంది, దీనితో పాటు భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించే బ్రాండ్ మానిఫెస్టో కూడా కూడా ఉంది.

లాంగిట్యూడ్ 77 ప్రస్తుతం మహారాష్ట్ర, గోవా, హర్యాణా, ఛండీగర్, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, కర్ణాటక, దుబాయ్, మరియు ఢిల్లీ మరియు ముంబయిలో పన్నులు లేకుండా లభిస్తోంది. ఇది భారతదేశంవ్యాప్తంగా తన విస్తరణను కొనసాగిస్తున్న కారణ ంగా, బ్రాండ్ ప్రీమియం, ఉల్లాస భరితమైన అనుభవాన్ని అందిం చడానికి కట్టుబడింది. విస్కీని అభిమానించే వారి కోసం ఒక కొత్త ప్రామాణం నెలకొల్పు తోంది.

# యూరియా కోసం పోలేపల్లి గేట్ వద్ద రైతుల ధర్నా

నల్గొండ, జనవరి 19: నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి స్టేజి వద్ద రైతులు యూరియా కోసం ధర్నా నిర్వహించారు. గత వారం రోజుల నుండి రైతులు యాప్‌లో బుక్ చేస్తున్నప్పటికీ యూరియా నిల్ అని రావడంతో విసుగు చెందిన రైతులు సోమవారం పోలేపల్లి గేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. సుమారు 2 గంటల పాటు రైతులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో రహదారికి ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసుల జోక్యంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు సైదులు, మోహన్, తదితరులుపాల్గొన్నారు.

# సర్పంచులు గ్రూప్ రాజకీయాలకు అతీతంగా ఉండాలి.. శిక్షణలో కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జనవరి 19:మెదక్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిమెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ..ఈ శిక్షణ కార్యక్రమం పావన్న పేట, నర్సింగి,మెదక్ ,హవేలీఘనాపూర్ (4 ) మండలం లోని దాదాపు 100 మంది సర్పంచులకు 5 రోజులపాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని, ఈ శిక్షణ కార్యక్రమంలో సర్పంచులు పంచాయతీ చట్టాలపై పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు.

పంచాయతీ రాజ్ చట్టంలోని గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి పథకాలు వంటి విపత్తుల సమయంలో సర్పంచ్ ల పాత్ర, డిజిటల్ సైన్, ఆదర్శ గ్రామపంచాయతీ ల నిర్మాణం తదితర అంశాలపై సర్పంచ్‌ల బాధ్యతలపై అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలోని ప్రతీ అంశాన్ని సర్పంచులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్య, వైద్యం నిరుపేదలకు అందేలా సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు.

మానవత్వ కోణంలో పని చేయాలని సూచిస్తూ.. డిజిటల్ గవర్ననెన్స్‌కు దోహద పడాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, మోరల్ స్కిల్స్, తదితర అంశాల పైన కూడా సర్పంచులు అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లోని సర్పంచులు గ్రూప్ రాజకీయాలకు అతీతంగా ఉండా లన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, నిరుపేదల అభివృద్ధి సర్పంచు లతోనే సాధ్యం అవుతుంద ని,గ్రామం అంటేనే స్వచ్ఛమైన వాతావరణం అని వివరించారు.

గ్రామ స్థాయిలో రాజకీయ పార్టీలకు అతీతంగా మంచి-చెడుల న్యాయ నిర్ణేత సర్పంచేనని అన్నారు. వార్డులలో ఓటు వేసిన వారిని ఓటు వేయని వారిని ప్రభుత్వ పథకాల్లో సమాన స్థాయిలో చూడాలన్నారు. కుల ,మత ,జాతి రాగద్వేశాలు ఉండొద్దు అని,బాల్య వివాహాలు,బాల కార్మిక వ్యవస్థ,కుల నిర్మూలన, మూఢనమ్మకాల నిర్మూలనలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు.

# 'కార్మిక, కర్షక, ప్రజా హక్కులను కాపాడుకోవడానికి ఉద్యమిద్దాం'




నల్లగొండ, జనవరి 19 : దేశ ఉత్పత్తిలో ప్రధాన భాగస్వామ్య రంగాలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రమైన దాడి చేస్తుందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా సిఐటియు, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల జాతీయ కమిటీల పిలుపు మేరకు సోమవారం నల్లగొండలో సిపిఎం ఆఫీసు నుండి గడియారం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి సభను నిర్వహించారు. ఈ సభకు జూలకంటి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడవసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం తన కార్పొరేట్, మతతత్వ విధానాలను వేగవంతం చేసిందన్నారు. ప్రజల హక్కులను కాల రాయడమే కాక రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను తనకు అనుకూలంగా మార్చుకుంటూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందన్నారు. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తూ, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లు, విబీజి రాంజీ చట్టం, బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇవ్వడం, అణురంగంలోకి ప్రైవేటు కంపెనీలను అనుమతించడం దారుణం అన్నారు. మళ్లీ గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పోవడానికి ప్రధాని మోదీ విధానాలు ముందుకు వస్తున్నాయని దీనిని వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ విబీ జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలన్నారు. నూతన చట్టం రాష్ట్రాలు 40 శాతం, కేంద్రం 60 శాతం నిధులు వెచ్చించాలని చేశారు. దీనివల్ల రాష్ట్రాలు నిధులు వెచ్చించలేని పరిస్థితులు వస్తాయని, దీనివల్ల ఉపాధి పని దినాలు తగ్గుతాయన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నదని వారు దుయ్యబట్టారు. ప్రశ్నించవద్దని నేటి విధానపత్రంలో మోదీ తెలియజేస్తున్నారు. సంపాదన సృష్టించడం, అభివృద్ధి చేయడం కార్మికుల పనిగా ఉన్నది కానీ మోదీ యజమానుల దయాదాక్షిన్యాలతో అడుక్కోవాలి తప్పా సమ్మెలు, పోరాటాలు చేసే హక్కును తొలగిస్తున్నట్లు, దీని ఫలితంగా కార్మిక వర్గం యజమానులకు బానిసలుగా మారనున్నట్లు పేర్కొన్నారు.

సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు, బొజ్జ చిన్న వెంకులు అధ్యక్షతన జరిగిన ఈ సభలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బికార్ మల్లేశ్, మహిళా రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల, ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద హాశం, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, సిఐటియు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బండ శ్రీశైలం, ఎండీ సలీం, కంబాలపల్లి ఆనంద్, దండెంపల్లి సత్తయ్య, మల్లు గౌతమ్ రెడ్డి, చింతపల్లి బయన్న, పాదూరి శశిధర్ రెడ్డి, నలపరాజు సైదులు, భీమగాని గణేష్, రవి నాయక్, అవుట రవీందర్, మన్నెం భిక్షం, పోలె సత్యనారాయణ, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్, జనవరి 19:విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ వో సుధాకర్ నాయక్ హెచ్చరించారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది హాజరు రికార్డులను, మందుల నిల్వలు, పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.మెడిసిన్ లభ్యతపై ఆరా తీశారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలో ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు వెంటనే చికిత్స అందించాలని అన్నారు. నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట వైద్యులు ఝాన్సీ, లక్ష్మి ప్రసన్న, సూపర్ వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

## అస్సాంలోని కలియబోర్‌లో రూ. 6,950 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించనున్న కాజీరంగ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ, జనవరి 19:అస్సాంలోని కలియాబోర్‌లో రూ. 6,950 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించనున్న కాజీరంగ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు భూమి పూజలో పాల్గొన్న సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు (జనవరి 18, 2026) ఆ ప్రాజెక్టు విశేషాలను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో వరస పోస్టుల్లో పంచుకున్నారు.

"కజిరంగా ఎలివేటెడ్ కారిడార్‌కు పునాది రాయి వేయడం ఎంతో గర్వంగా, గౌరవంగా భావిస్తున్నా. ఇది వన్యప్రాణులకు భద్రత కల్పిస్తుంది. పర్యావరణ పరిరక్షణ కోసం మేం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇస్తుంది."

"కలియబోర్ తో పాటు మొత్తం అస్సాం ప్రజల ఉత్సాహం - డబుల్-ఇంజిన్ ఎన్డీఏ ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం అవుతుందనే వారి నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది."

"కాంగ్రెస్ ను ప్రతిచోటా తిరస్కరిస్తున్నారు. మహారాష్ట్రలోని ప్రధాన నగరాల్లో జరిగిన ఎన్నికల్లో వారు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయారు. వారికి అభివృద్ధికి సంబంధించిన ఎజెండా లేదు. కాంగ్రెస్ పార్టీ కాజీరంగా లేదా అస్సాం సంక్షేమం కోసం ఎప్పుడూ పని చేయలేదు."

"కలియబోర్ నుంచి నుమాలిగడ్ వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది, వన్యజీవులను రక్షిస్తుంది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తుంది."

"అస్సాంను రోడ్లు, రైల్వేలు, వాయుమార్గాలు, జలమార్గాల ద్వారా అనుసంధానించడానికి సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తున్నాం."

"కాంగ్రెస్‌కు ఒకే ఒక్క విధానం ఉంది - చొరబాటుదారులను కాపాడటం, అధికారాన్ని స్వాహా చేయటం. అయితే, ఈ భయంకర మనస్తత్వం ఉన్న కాంగ్రెస్ కు అస్సాం భూమి నుంచి కూడా గట్టి సమాధానమే వస్తుందని నా నమ్మకం."

## రిజర్వేషన్ల తగ్గింపుపై మిర్యాలగూడలో బీసీ జేఏసీ నిరసన



నల్గొండ, జనవరి 19: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా మోసం చేసిందని బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణాధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. ప్రభుత్వ చర్యను నిరసిస్తూ సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కళ్లకు నల్ల గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలను అన్ని పార్టీలు మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు బీసీలను వాడుకుని వదిలేస్తున్నాయన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే దిశగా పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు చెప్పారు.

కావునా ఇప్పటికైనా బీసీలంతా పెద్ద ఎత్తున పార్టీలకు అతీతంగా జనరల్ స్థానాల్లో ఎన్నికల బరిలో దిగాలన్నారు. బీసీల ఓట్లు బీసీలకు వేసుకుని జనాభా దామాషా ప్రకారం మనమెంతో మనకంత వాటా సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మిర్యాలగూడ నియోజవర్గ అధ్యక్షుడు గుండెబోయిన నాగేశ్వరావు యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్ ముదిరాజ్, కె.కోటయ్య, ఎం.వెంకన్న, బలరాం, సోయల్, శివయ్య, కిరణ్, కిషన్, విజయ్, సతీష్, శ్రీకాంత్, కృష్ణ, శివయ్య, జాంగిర్, సత్యం, శ్రీనివాస్, వెంకటేశం పాల్గొన్నారు.

## పఠాన్‌బస్తీ అభివృద్ధి ఘనత బీఆర్ఎస్‌దే : ఎమ్మెల్యే ముఠా గోపాల్



హైదరాబాద్, జనవరి 19:ముషీరాబాద్ పఠాన్‌బస్తీలో మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యాల కల్పనకు తాను ఎంతో కాలంగా కష్టపడి పని చేస్తే ఈ మధ్యకాలంలో కొంతమంది వచ్చి వేం చేయించామంటూ ప్రచారం చేసుకోవడం శోచనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. టెండర్ పనులు పూర్తవుతున్న క్రమంలో లెటర్స్ ఇచ్చి తాము చేయించినట్లుగా ప్రజల్లో చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ పఠాన్‌బస్తీలో రూ 22.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ తాము చేయించిన పనులను వారి ఖాతాలో వేసుకుంటూ భరితెగించి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పఠాన్‌బస్తీ డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం తాను రోడ్డు వేయకముందే నిధులు మంజూరు చేయించానని, గుత్తేదారులు అగకుండా రోడ్డు పనులు చేపట్టడంతో పైపులైన్ పనులు పూర్తి చేయలేకపోయామని స్పష్టం చేశారు.

కొత్తగావేసిన రోడ్డును తవ్వకూడదనే తాము పనులు నిలిపి వేశామని, ఇప్పుడు పనులు ప్రారంభించడానికి సిద్ధమైతే కొందరు ఇంటింటికి వెళ్లి మా ఎంపి, కార్పొరేటర్ చేయించినట్లు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. స్థానికులను అడిగితే ఎవరు చేయించారో తెలుస్తుందన్నారు. చాలా కాలంగా ఎదురవుతున్న పఠాన్‌బస్తీ డ్రైనేజీ సమస్య పరిష్కారమౌతుందని, త్వరితగతిన పనులు ప్రారంభిచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పొరేటర్ ఎం.సుప్రియ, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, టీ.సోమసుందర్, ఎడ్ల హరిబాబు యాదవ్, శ్రీధర్‌రెడ్డి, డి.శివముదిరాజ్, శ్రీధర్ చారి, బి.శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ముదిగొండ మురళీ, దీన్‌దయాల్‌రెడ్డి, బాబురావు, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్త మార్కండేయ జయంతి కరపత్రాల ఆవిష్కరణ

నల్గొండ, జనవరి 19: రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో ఈ నెల 21న నిర్వహించే భక్త మార్కండేయ జయంతి ఉత్సవ కరపత్రాలను సోమవారం మండల కేంద్రంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆడెపు లక్ష్మీనారాయణ, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆడపు శ్రీశైలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కండేయ జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను గ్రామం లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు బిర్రు బాలకిషన్, ఆడెపు రాజు, సహాయ కార్యదర్శి బల్ల కృష్ణ, కోశాధికారి చుంచు నారాయణ, సభ్యులు స్వర్గం బాలకిషన్, పొట్టబత్తిని వెంకటేష్, నాయకులు ఆడపు రామకృష్ణయ్య, పొట్టబత్తిని నరేందర్, సకినాల ఉపేందర్ పాల్గొన్నారు.

## మండపేటలో దారుణం
### -అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య
### -కాసేపటికే భర్త ఆత్మహత్యాయత్నం

అమరావతి, జనవరి 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ జిల్లాలోని మండపేటలో దారుణం చోటుచేసుకుంది. అనుమానాస్పద స్థితిలో వివాహత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే భార్య చనిపోయిన కాసేపటికే భర్త ఆత్మహత్యాయత్నం చేసుకుంది. రైలు పట్టాలపై పడుకొని చనిపోయేందుకు భర్త ఫణీంద్ర యత్నించాడు. రైల్వే పోలీసులు కాపాడి ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉంటే అల్లుడే తమ కూతుర్ని హత్య చేశాడని భారతి తల్లిదండ్రులు అంటున్నారు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని ఆరోపించారు. 2019లో భారతి, ఫణీంద్రల వివాహం జరిగింది.

## ప్రజలకు మెరుగైన పాలన అందించాలి : కలెక్టర్ బి.చంద్రశేఖర్

ఖమ్మం, జనవరి 19:నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు ప్రజలకు మెరుగైన పాలన అందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు. ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు నేటి నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని టీటీడీసీలో ప్రారంభించి మాట్లాడారు. మొదటి విడత నల్లగొండ, నకిరేకల్ నియోజ కవర్గాలలోని మండలాలు, అలాగే తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండల సర్పంచులకు 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ప్రజలు సర్పంచులకు కల్పించిన ఒక గొప్ప అవకాశం అన్నారు.

మహాత్మా గాంధీ చెప్పినట్లు గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు తీర్చడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సర్పంచులది కీలకపాత్ర అన్నారు. చట్టపరంగా సర్పంచుల హక్కులు, బాధ్యతలు, వివిధ ప్రభుత్వ పథకాల వివరాలు సమగ్రంగా తెలుసుకుని ప్రజలకు సుపరి పాలన అందించాలని ఆయన నూతన సర్పంచులను కోరారు. సర్పంచులు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారికి దక్కిన పదవీ కాలాన్ని సద్విని యోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, ఆర్‌డీఓ అశోక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కె.అనిల్ కుమార్, హైదరాబాద్ ట్రైనింగ్ సెంటర్ హెడ్ డి.రాఘ వేంద్రరావు, డిపిఓ శంకర్ నాయక్, జడ్పీ సీఈఓ శ్రీనివాస రావు, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్ పాల్గొన్నారు.

బాధ్యతతో భద్రత మెరుగు : ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో ఉంటాయని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అన్నారు.

## ప్రజలకు మెరుగైన పాలన అందించాలి : కలెక్టర్ బి.చంద్రశేఖర్



నల్గొండ, జనవరి 19:నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు ప్రజలకు మెరుగైన పాలన అందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు. ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు నేటి నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని టీటీడీసీలో ప్రారంభించి మాట్లాడారు. మొదటి విడత నల్లగొండ, నకిరేకల్ నియోజకవర్గాలలోని మండలాలు, అలాగే తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండల సర్పంచులకు 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ప్రజలు సర్పంచులకు కల్పించిన ఒక గొప్ప అవకాశం అన్నారు.

మహాత్మా గాంధీ చెప్పినట్లు గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు తీర్చడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సర్పంచులది కీలకపాత్ర అన్నారు.

చట్టపరంగా సర్పంచుల హక్కులు, బాధ్యతలు, వివిధ ప్రభుత్వ పథకాల వివరాలు సమగ్రంగా తెలుసుకుని ప్రజలకు సుపరిపాలన అందించాలని ఆయన నూతన సర్పంచులను కోరారు. సర్పంచులు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారికి దక్కిన పదవీ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, ఆర్‌డీఓ అశోక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కె.అనిల్ కుమార్, హైదరాబాద్ ట్రైనింగ్ సెంటర్ హెడ్ డి.రాఘవేంద్రరావు, డిపిఓ శంకర్ నాయక్, జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్ పాల్గొన్నారు.

## వైభవంగా నాగోబా జాతర ప్రారంభం..హాజరైన ప్రముఖులు



ఆదిలాబాద్, జనవరి 19: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో కొలువుదిరిన ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం నాగోబా దేవతకు మెస్రం వంశీయులు ఆదివారం అర్ధరాత్రి నిర్వహించిన మహాపూజతో నాగోబా జాతర వైభవంగా ప్రారంభమైంది.జన్నారం మండలం హస్తిన మడుగు నుంచి సేకరించిన పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకించి జాతరను ప్రారంభించారు. గ్రామంలోని మురాడీ నుంచి పురాతన నాగోబా విగ్రహం తోపాటు పవిత్ర గంగాజలంతో మెస్రం వంశీయులు నాగోబా ఆలయానికి చేరుకున్నారు. పురాతన నాగోబా విగ్రహాన్ని ఆలయంలోని విగ్రహం వద్ద ఉంచి పూజలు చేశారు. నాగోబా ఆలయం వెనుక భాగంలో పవిత్రమైన గంగాజలం ఝరినను భద్రంగా ఉంచారు.

మెస్రం వంశీయులు నిర్వహించిన నాగోబా మహాపూజలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, అనిల్ జాదవ్, పాయల శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అధికారాన్ని బీజేపీ కేంద్రీకరిస్తున్నది: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జనవరి 19:ఆర్ఎస్ఎస్, బీజేపీపై మళ్లీ విమర్శలు చేశారు రాహుల్ గాంధీదేశంలో అధికారాన్ని కేంద్రీకృతం చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కేరళలోని కొచ్చిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇవాళ ప్రసంగించారు. తమ పార్టీ వికేంద్రీకరణను విశ్వసిస్తుందన్నారు. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ 73, 74వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు.రాజ్యాంగాన్ని పరిరక్షించడం అంటే గ్రామీణ స్థాయిలో పరిపాలనను వికేంద్రీకరించడం అవుతుందని రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలో నిశబ్ద సంస్కృతి పెరుగుతోందని, దీని పట్ల జాగ్రత్తగా ఉండాలని మలయాళ రచయిత ఎం లీలావతి హెచ్చరించి నట్లు కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. ప్రజలు మౌనంగా ఉంటే కొందరు కార్పొరేట్లు దేశ సంపదను నియంత్రించే అవకాశం ఉంటుందని ఆరోపించారు.

# గులాం అహ్మద్ హుస్సేన్ చొరవ

## - బాధిత విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



కరీంనగర్, జనవరి 19:కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామ శివారులోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న నదీమోద్దీన్ అనే విద్యార్థి 2025 అక్టోబర్ నెలలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కాగా, 2025 అక్టోబర్ 22న బాధిత పేద కుటుంబానికి 2లక్షలు మంజూరు చేయాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, టెమ్రిస్ సెక్రటరీ షేఫియుల్లాను హైదరాబాద్ హెడ్ ఆఫీస్ లో కలిసి వినతిపత్రం అందజేశారు.గులాం అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తికి స్పందించిన సెక్రటరీ షఫియుల్లా, ఇటీవలే 2లక్షలను మంజూరు చేశారు. మంజూరైన చెక్ ను బాధిత విద్యార్థి కుటుంబానికి సోమవారం మగ్ధూమ్ పూర్ లోని టేమ్రిన్ బాలుర 3 కళాశాలలో రెండు లక్షల చెక్ ను గులాం అహ్మద్ హుస్సేన్ అందజేశారు.ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కుటుంబానికి పెద్దది ఎక్కువగా ఉన్న ఈ విద్యార్థి ప్రమాద వశాత్తు మరణించడంతో బాధిత కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, ఈ పేద కుటుంబానికి తన విజ్ఞప్తి మేరకు బాసటగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులకు, టేమ్రిస్ సెక్రటరీ షఫియుల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, ప్రిన్సిపాల్ చంద్రమోహన్,డిప్యూటీ వార్డెన్ ఉస్మాన్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం: లింగంపల్లి శంకర్

రాజన్న సిరిసిల్ల, జనవరి 19: నేటినిజం ప్రతినిధి): రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ లింగంపల్లి శంకర్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు తగిన నిధులు అందలేదని విమర్శించారు. పట్టణాల్లో జరుగుతున్న స్వల్ప అభివృద్ధి కూడా కేవలం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధుల ద్వారానే సాధ్యమవుతోందని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి ఉండదని, ఆ పార్టీ పాలనలో పట్టణాలు మరింత వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు ఆదర్శంగా మారాలంటే బీజేపీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టే పార్టీలను నమ్మవద్దని, అభివృద్ధికి కట్టుబడి ఉన్న బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని లింగంపల్లి శంకర్ కోరారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయకపోతే మూడు పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాం

## - బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

## -బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ();మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేయకపోతే మూడు పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తామని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. నిన్న మేడారంలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై కనీసం చర్చించలేదని, బీసీ రిజర్వేషన్లపై చర్చించకుండా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్వహించడం బీసీలను మరోసారి దగా చేయడమేనని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా ఫైర్ అయ్యారు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు హైదరాబాదులోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు బీసీ జేఏసీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు . ఆందోళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క వైఖరి మారకపోతే భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం మంత్రివర్గ



సమావేశంలో బీసీ రిజర్వేషన్ల పై ఎందుకు చర్చించలేదు చట్టపరంగా ఇవ్వలేనప్పుడు పార్టీ పరంగానైనా ఇస్తామని ఎందుకు ప్రకటించడం లేదు మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు జరపాలని బిజెపి, బిఆర్ ఎస్ పార్టీలు ఎందుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం లేదు గ్రామపంచాయతీ ఎన్నికల తర్వాత 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఇక ఎన్నికలైనా నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్పష్టంగా హామీ ఇచ్చి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని నిర్ణయించడం అంటే బీసీలను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసిందని ఆయన మండిపడ్డారు బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిన బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు, ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థించడం చాలా సిగ్గుచేటు అన్నారు అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు మద్దతిచ్చిన అఖిలపక్ష పార్టీలు ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే ఏ రాజకీయ పార్టీ కూడా సడిచప్పుడు చేయకుండా మౌనం పాటిస్తున్నాయని, ఈ పార్టీలకు బీసీల పైన కపట ప్రేమ ఉందని మున్సిపల్ ఎన్నికల విషయంలో తేలిపోయింది అన్నారు మెస్సి ఆట కోసం హైదరాబాదుకు వచ్చిన రాహుల్ గాంధీ బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్న హైదరాబాద్ కు వచ్చి ఎందుకు స్పందించడం లేదన్నారు బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు బుట్ట దాఖలు చేస్తుంటే రాహుల్ గాంధీ కళ్ళుమూసుకుంటున్నాడా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై బీసీలకు ద్రోహం తలపెడుతున్నాయని బీసీ రిజర్వేషన్లు తగ్గడానికి స్థానిక ఎన్నికలు జరగడానికి ఈ రెండు పార్టీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు చట్టపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఇవ్వలేకపోతే బీసీ సమాజానికి క్షమాపణ చెప్పి పార్టీ గుర్తులతో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీపరంగా జనాభా దామాషా ప్రకారం 56% టికెట్లు ఇస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు,లేదంటే కాంగ్రెస్ ను బీసీలు ఇక జన్మలో నమ్మరని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇక ముగిసిన అధ్యాయంగా మిగిలిపోతుందని ఆయన హెచ్చరించారు బీసీ రిజర్వేషన్ల 42 శాతం సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని రెండు రోజుల్లోనే జేఏసీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు ఉద్యమ కార్యక్రమం ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, అధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ జేఏసీ కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్,బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, జజుల లింగం గౌడ్, బుదాని సదానందం,మాదేశి రాజేందర్, తారాకేశ్వరి, జిల్లెల నరసింహ, గూడూరు భాస్కర్, సంధ్యారాణి, సిద్ధాంతం శ్యామల, శైలజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, విజయలక్ష్మి, రాజేశ్వరి,వెంకటేష్, శ్రీనివాసాచారి, గజ్జల సత్యం గౌడ్, జే. వెంకటయ్య,జే. వెంకటమ్మ, నర్సమ్మ, అంజమ్మ, బీవీ, అలవేల, తదితరులు పాల్గొన్నారు ..

# వీబీజీ రామ్ జీ చట్టం-2025 గ్రామ స్వరాజ్యానికి నిజమైన బలమిచ్చే చారిత్రాత్మక సంస్కరణ

## -బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వీబీజీ రామ్ జీ చట్టం-2025 గ్రామ స్వరాజ్యానికి నిజమైన బలమిచ్చే చారిత్రాత్మక సంస్కరణ అని బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య అన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌడ్వీ బీజీ రామ్ జీ చట్టం-2025 అనేది కేవలం మరో చట్టం కాదు. ఇది గ్రామ స్వరాజ్యానికి జీవం పోసే సంస్కరణ. అవినీతికి చెక్ పెట్టే వ్యవస్థ. ప్రజాధనం ప్రజల చేతుల్లోకే చేరేలా చేసే బలమైన మార్గం. ఈ చట్టం ద్వారా గ్రామాలు, సర్పంచులు, వార్డు మెంబర్లకు కలిగే లబ్ధి ఏమిటో ప్రతి ఒక్క గ్రామస్తుడికి తెలియాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 12,700 గ్రామాలకు ఈ చట్టం ద్వారా వచ్చే మార్పు చేరాలని నేను హృదయపూర్వకంగా కోరుకుంటున్నానన్నారు.

ఎంజిఎన్ఆర్ఈజిఏ పథకం ప్రపంచంలోనే అతి పెద్ద సంక్షేమ పథకాలలో ఒకటి. ఇప్పటివరకు ఈ పథకం మీద ఖర్చు చేసిన మొత్తం రూ. 11 లక్షల 53 వేల కోట్లు. అక్షరాలా చెప్పాలంటే- పదకొండు లక్షల యాభై మూడు వేల కోట్లు. మొత్తం ఖర్చులో యూపీఏ ప్రభుత్వ కాలంలో (10 సంవత్సరాలు) ఖర్చు చేసింది కేవలం రూ. 2 లక్షల 13 వేల కోట్లు మాత్రమే. కానీ నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 8 లక్షల 53 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇది మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధికి స్పష్టమైన నిదర్శనం.

ఎంజిఎన్ఆర్ఈజిఏ పథకంలో ఉన్న లోపాలు దేశ ప్రజలకు కొత్తవి కావు. గ్రామాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ ఇవి అనుభవంలోకి వచ్చిన విషయాలేనన్నారు.ఫేక్ జాబ్ కార్డులు, ఫేక్ వర్కులు, లెక్కలకందని భారీ అవినీతి ఇవన్నీ కాంగ్రెస్ పాలనలో సాధారణంగా మారాయి. పేదల కోసం వచ్చిందని చెప్పిన మన్రేగా పథకం మధ్యవర్తుల చేతుల్లో పడింది, కాంట్రాక్టర్లకు లాభంగా మారింది, కానీ గ్రామాలకు మాత్రం శాశ్వత ప్రయోజనం దక్కలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మన్రేగాను కరప్షన్‌కు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మార్చిందన్నారు.

2014 తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. మోదీ గారు ఎంజిఎన్ఆర్ఈజిఏ లో సంస్కరణల దిశగా కీలక అడుగులు వేశారు. ఆధార్ సీడింగ్ ద్వారా ఒకే వ్యక్తికి పది జాబ్ కార్డులు అనే పరిస్థితికి చెక్ పెట్టారు. నకిలీ లబ్ధిదారులను వ్యవస్థ నుంచి తొలగించారు. బీటీ - డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా మధ్యవర్తులను తొలగించి, కూలీ డబ్బులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరేలా చేశారు. ఈ మార్పులతో వ్యవస్థలో పారదర్శకత వచ్చింది, అవినీతికి బ్రేక్ పడింది, బాధ్యత అనే భావన ఏర్పడిందన్నారు.

దేశంలో సుమారు 2 లక్షల 60 వేల గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మన్రేగా కింద ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ. 11 లక్షల 53 వేల కోట్లను గ్రామాల వారీగా లెక్కిస్తే ప్రతి గ్రామానికి సగటున రూ. 8 నుంచి 10 కోట్లు ఖర్చు చేసినట్టే. ఇప్పుడు ఒక నిజాయితీగల ప్రశ్న - ఏ గ్రామానికి వెళ్లినా ఈ డబ్బుతో నిర్మితమైన శాశ్వత పనులు కనిపిస్తున్నాయా..ఈ డబ్బుతో గ్రామాల్లో ఉండాల్సింది బలమైన ప్రభుత్వ భవనాలు, పక్కా రోడ్లు, సీసీ రోడ్లు, చెరువుల పునరుద్ధరణ, హరితహారం పేరుతో నిజమైన అడవుల నిర్మాణం. కానీ వాస్తవంగా జరిగినది ఏమిటంటే .. గుంటలు తీయడం, మళ్లీ పూడ్చడం, కొన్ని మొక్కలు నాటడం, కొద్ది నెలల్లో వాటి ఆచూకీ కూడా లేకపోవడం. శాశ్వత ఆస్తులు లేవు. తరతరాలకు ఉపయోగపడే పనులు లేవు. డబ్బు ఖర్చయింది? కానీ అభివృద్ధి కనిపించలేదు.

ఎంజిఎన్ఆర్ఈజిఏ గా లో అసలు సమస్య డబ్బు ఖర్చు చేయడం కాదు. డబ్బుతో ఏమి సృష్టించాం అన్నదే అసలు ప్రశ్న. కాంగ్రెస్ పాలనలో మన్రేగా అంటే ఖర్చు + కరప్షన్ మాత్రమే. గ్రామ అభివృద్ధి మాత్రం జీరోగా మిగిలింది. ఈ 20 ఏళ్ల అనుభవం నుంచే మోదీ ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చింది ? డబ్బు ఖర్చుతో పాటు గ్రామాల్లో శాశ్వత ఆస్తులు సృష్టించాలి. గ్రామ పంచాయతీలకు బాధ్యత ఇవ్వాలి, ప్రజలు ప్రశ్నించే హక్కు కల్పించాలన్నారు.

వీబీజీ రామ్ జీ చట్టం-2025 యొక్క ఆత్మ ఇదే. ఉపాధి + ఉత్పాదకత కలవాలి. డబ్బు + బాధ్యత కలవాలి. గ్రామం + అభివృద్ధి కలవాలి. అప్పుడే దేశం ముందుకు నడుస్తుంది. ఈ చట్టం గ్రామా లకు నిజమైన స్వయం నిర్ణయా ధికారాన్ని ఇస్తుంది. ప్రజాధనం ప్రజల పర్యవేక్షణలో ఖర్చయ్యే విధంగా వ్యవస్థను రూపొం దిస్తుంది.ఈ డబ్బు సరిగ్గా ఉపయోగిస్తే - ఉదాహరణ లుమన్రేగా పేరుతో ఖర్చు చేసిన రూ. 11 లక్షల 53 వేల కోట్లను ఉత్పాదక ఉపాధితో కలిపి, నిర్మాణాత్మకంగా వినియోగించి ఉంటే - దేశంలో 4 కోట్ల 60 లక్షల పక్కా ఇండ్లు నిర్మించి ఉండేవాళ్లం. 1 లక్ష 55 వేల కిలోమీటర్ల ఫోర్ లేన్ జాతీయ రహదారులు, 11 లక్షల 50 వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లు వేసి ఉండేవాళ్లం.

ప్రతి జిల్లాలో ఆధునిక సదుపాయాలతో 191 పడకల ఆసుపత్రులు, 2 లక్షల 30 వేల కార్పొరేట్ స్థాయి స్కూళ్లు నిర్మించి ఉండేవాళ్లం. 11 కోట్ల ఎకరాలకు సాగునీటి సదుపాయం, 1 లక్ష 55 వేల కిలోమీటర్ల రైల్వే లైన్లు, 2 లక్షల 80 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమయ్యేది.



ఈరోజు కొందరు నేతలు మన్రేగా మీద చాలా పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. కానీ వాస్తవం ఏంటంటే భారత దేశంలో మన్రేగా కింద 100 రోజులు ఉపాధి ఇవ్వాలన్న నిబంధన ఉన్నప్పటికీ, ఎక్కడా 50 రోజులు కూడా పూర్తిగా అమలుకాలేదు. ప్రత్యేకంగా తెలంగాణలో అయితే పరిస్థితి మరింత దారుణం. ఇక్కడ ఇప్పటివరకు ఎంజిఎన్ ఆర్ఈజిఏ కింద సగటున 28 రోజుల కంటే ఎక్కువ ఉపాధి ఇవ్వలేకపోయారు. ఇది మాటలతో కాదు, గణాంకాలతో నిరూపితమైన వాస్తవం.

బీజేపీ పాలించే హర్యానా రాష్ట్రంలో ఎంజిఎన్ఆర్ఈజిఏ కింద రోజుకు రూ. 400 కూలీ ఇస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎందుకు కేవలం రూ. 307 మాత్రమే ఇస్తున్నారు? మీకు నిజంగా ఎంజిఎన్ఆర్ఈజిఏ మీద అంత ప్రేమ ఉంటే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రూ.400 ఇస్తుంటే, తెలంగాణలో ఎందుకు తక్కువ ఇస్తున్నారు? దీనికి ముఖ్యమంత్రి గారు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. మోదీ తీసుకొచ్చిన మరో కీలక మార్పు - స్థిరమైన బడ్జెట్గతంలో బడ్జెట్ ఎంత వస్తుందో, ఎంత విడుదల చేస్తారో ఎవరికీ తెలియని పరిస్థితి ఉండేది. కానీ ప్రధాని నరేంద్ర మోదీ గారు ఆ అనిశ్చితికి ముగింపు పెట్టారు. ఈరోజు మన్రేగా కోసం నిర్ణీతమైన వార్షిక బడ్జెట్ ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం సుమారు రూ. 1 లక్ష 51 వేల కోట్లు కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది రైల్వే, విద్యా బడ్జెట్‌ల తరహాలో స్థిరత్వం తీసుకువచ్చిన చారిత్రాత్మక నిర్ణయం.

ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా సుమారు రూ. 95 వేల కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. రాష్ట్రాల వాటా సుమారు 40 శాతం ఉంటుంది. యూపీఏ పాలనలో రూ. 10-12 వేల కోట్లు ఇవ్వడానికే చేతులు ఎత్తేసిన కేంద్రం, ఈరోజు మోదీ గారి నాయకత్వంలో రూ. 95 వేల కోట్లకు పైగా ఇవ్వడానికి ముందుకొస్తోంది. ఒక్క రూపాయి కూడా తగ్గించకుండా కేంద్రం తన బాధ్యతను నిర్వర్తిస్తోంది.

మోదీ గారి పాలనలో మన్రేగా కింద ఉపాధి రోజుల సంఖ్యను కూడా పెంచారు. సాధారణంగా ఉన్న 100 రోజుల ఉపాధిని 125 రోజుల వరకు పెంచారు. అటవీ ప్రాంతాల్లో అయితే 150 రోజుల వరకు ఉపాధి కల్పించే అవకాశం కల్పించారు. ఇది గ్రామీణ కూలీల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకువచ్చే నిర్ణయం.

ఈరోజు దేశంలో సుమారు 2 లక్షల 60 వేల గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వార్షికంగా సుమారు రూ. 1 లక్ష 15 వేల కోట్లు గ్రామాలకు వెళుతున్నాయి. పాపులేషన్‌ను బట్టి లెక్కిస్తే, ఒక్కో గ్రామానికి సంవత్సరానికి సగటున రూ. 50 లక్షలు వచ్చే అవకాశం ఉంది. ఐదు సంవత్సరాల్లో ఇది రూ. 2 కోట్ల 50 లక్షలు అవుతుంది.ముఖ్యంగా ఈ డబ్బుపై నిర్ణయం తీసేది ఢిల్లీ కాదు గ్రామసభ. సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లే ఈ డబ్బును ఎలా వినియోగించాలో నిర్ణయిస్తారు.

### వికసిత్ పంచాయత్ - మోదీ గారి విజన్

మోదీ గారు స్పష్టంగా చెప్పారు - కేంద్రం నిధులు పంపిస్తుంది. వికసిత్ భారత్ -2047 కి అనుగుణంగా వికసిత్ పంచాయత్ ప్రణాళిక రూపొందించండి.ఐదు సంవత్సరాల ప్రణాళిక వేసుకోండి. గ్రామంలో రోడ్డు లేకపోతే రోడ్డు వేయండి.

సీసీ రోడ్లు లేకపోతే సీసీ రోడ్లు వేయండి. పంట కాలువలు లేకపోతే కాలువలు తవ్వండి. చెరువులు నిర్మించండి. ఫిష్ పాండ్స్ ఏర్పాటు చేయండి. కామన్ షెడ్స్, పౌల్ట్రీ షెడ్స్, పశువుల కొట్టాలు నిర్మించండి. చేతివృత్తుల కార్మికులకు అవసరమైన భవనాలు నిర్మించండి. ఇదే వీబీజీ రామ్ జీ చట్టం2025 యొక్క అసలు ఆత్మ.

# తెలుగువారు అన్ని రంగాల్లో నెం.1గా ఉండాలి: లోకేశ్

జ్యూరిక్ జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా జ్యూరిక్‌లో తెలుగు డయాస్పోరాతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. తెలుగు అన్ని రంగాల్లో నెం.1గా ఉండాలని ఆకాంక్షించారు. "సముద్రాలు దాటి వచ్చినా మన సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 20 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ఈ సమావేశం కూటమి ప్రభుత్వానికి అదృష్టం లాంటిది.

ఏడాదిన్నరలో ఎపికి రూ.23.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా 16 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. అభివృద్ధి, ఐటి, క్వాంటమ్ అంటూ ఎపిని చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు" అని లోకేశ్ పేర్కొన్నారు.

# ఆఫీసులోనే హగ్గింగ్, కిస్సింగ్.. కర్నాటక డీజీపీ వీడియో వైరల్

బెంగుళూరు జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కర్నాటకలో డీజీపీ ర్యాంక్ ఐపీఎస్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావుకు చెందిన రాసలీలల వీడియో వైరల్ అవుతున్నది. ఇప్పటికే ఆయన అనేక విమర్శలు ఎదుర్కొంటున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ కేసులో ఆయన కుమార్తె రన్యారావుపై దర్యాప్తు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఆఫీసు ఛాంబర్‌లో ఓ మహిళతో సరసం ఆడుతున్న దృశ్యాలకు చెందిన వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్నది. ఓసారి యూనిఫామ్ వేసుకుని, సివిల్ దుస్తుల్లో మరోసారి.. వేర్వేరు మహిళలను హత్తుకుంటూ, కిస్ ఇస్తూ డీజీపీ రామచంద్రరావు ఆ వీడియోలో కనిపించారు.ఆఫీసు వేళల్లో ఆయన రాసలీలలు ఆడడం అభ్యంతరకరంగా మారింది. డీజీపీ ఆఫీసులోనే ఆ వీడియోను చాలా సీక్రెట్‌గా రికార్డింగ్ చేశారు. కనీసం అయిదారు నెలల క్రితం ఆ వీడియో తీసినట్లు అనుమానిస్తున్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం..



కరీంనగర్, జనవరి 19: (నేటినిజం ప్రతినిధి) విడ్స్ స్వచ్ఛంద సంస్థ,ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రోజున నగునూరు గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి యుగంలో డిజిటల్ లావాదేవీలు,ఆన్‌లైన్ సేవలు మన దైనందిన జీవితంలో భాగమయ్యాయనీ,బ్యాంకింగ్, విద్య,వైద్యం, ప్రభుత్వ సేవలు అన్నీ ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి వచ్చాయని, అయితే ఈ సౌకర్యాలతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్న దృశ్య ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మాన కొండూర్,విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై, అంక్టైవ్డ్ డిపాజిట్ల,సామాజిక భద్రత పథకాలపై అవగాహన కార్యక్రమం జరిగింది.. ముఖ్యంగా ప్రజలకు ఆన్‌లైన్ మోసాలు,ఫిషింగ్ కాల్స్,నకిలీ లింకులు, ఓటిపి మోసాలు,సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాల గురించి వివరించారు. ముఖ్యంగా బ్యాంక్ వివరాలు,ఏటీఎం పిన్, ఓటీపీ వంటి గోప్య సమాచారాన్ని ఎవరికీ చెప్పకూడదని అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగితే ఎవరిని సంప్రదించాలి,ఎలా ఫిర్యాదు చేయాలి అనే విషయాలపై కూడా స్పష్టమైన సమాచారం అందించారు.కేంద్ర ప్రభుత్వము ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 , ఇఎవతీఇతీతిఎవ.ఐనీల.తిని వెబ్‌సైట్ గురించి ప్రజలకు తెలియజేశారు. మహిళలు,వృద్ధులు, విద్యార్థులు వంటి వర్గాలు సైబర్ నేరాలకు ఎక్కువగా గురవుతున్న నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో సైబర్ భద్రతపై చైతన్యం పెరిగింది.ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండి, అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలకు స్పందించకుండా ఉంటే సైబర్ నేరాలను నివారించవచ్చు అని ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ తొర్తి శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సాగరిక, క్రాంతి కుమార్,గ్రామ పెద్దలు, గ్రామసర్పంచ్,ఉపసర్పంచ్ ,కార్యదర్శి,వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువతిని ప్రేమ పేరుతో మోసం.. ఎస్సై కి 10 సంవత్సరాల జైలు శిక్ష

గుంటూరు జనవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఓ యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడు ఓ ఎస్సై. దీంతో ఆ ఎస్సైకి గుంటూరు జిల్లా న్యాయస్థానం శిక్ష విధించింది. రవితేజ అనే ఎస్సై నగరం పాలెం ఎస్సైగా ఉన్న సమయంలో ఓ యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడు. దీంతో యువతి న్యాయం కోసం కోర్టును ఆశ్రయించింది. ఈ కేసుపై విచారణ జరిపిన జిల్లా 4వ అదనపు కోర్టు న్యాయమూర్తి రవితేజకు 10 సంవత్సరాల కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. రవిజేతేజ ప్రస్తుతం అమృతలూరు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com